1

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

నల్లగొండ

శనివారం | మార్చి 22, 2025 | www.navatelangana.com



సన్న బియ్యానికి... సన్నాహాలు..

- ఏప్రిల్ నుంచి రేషన్ షాపుల్లో సన్న బియ్యం
- సన్న బియ్యం సప్లై తో బ్లాక్ మార్కెట్‌కు బ్రేక్

నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

రేషన్ కార్డుల ద్వారా ప్రతి కుటుంబానికీ సన్నబియ్యాన్ని అందిస్తామని 2023లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ హామీ ఇచ్చి పలు మార్లు వాయిదా వేసుకుంటూ ఎట్టకేలకు 15 నెలల తర్వాత రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యాన్ని ఏప్రిల్ మాసం నుంచి ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే రేషన్ షాపులకు సన్న బయ్యాన్ని పంపిణీ చేసేందుకు స్టాక్ పాయింట్లకు సన్న బియ్యాన్ని తరలిస్తున్నారు. కార్డులో ఉన్న ఒక్కొక్క లబ్దిదారునికి 6 కేజీల చొప్పున సన్న బియ్యం సన్నాహాలు చేస్తున్నారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇలా..

ఉమ్మడి నల్గొండ జిల్లాలో 71 మండలాల్లో 10,07,011కార్డులు ఉండగా 29,82,694 యూనిట్లకు గాను 19 వేలమెట్రిక్ టన్నుల బియ్యం ప్రతినెల కేటాయిస్తున్నారు. ఇందులో నల్గొండ జిల్లాలో 4,66,008 కార్డులు, సూర్యాపేటలో కార్డులు, యాదాద్రి భువనగిరి జిల్లాలో 2,16,831 కార్డులు ఉన్నాయి. గత నవంబర్లో చేపట్టిన ఇంటింటి సర్వేలో27,753 కార్డులు లేని వారిగా గుర్తించారు. కాగా మండలానికి ఒక గ్రామానికి పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని రేషన్ కార్డుల కోసం దరఖాస్తులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. జనవరి 26న 7986 మందిని రేషన్ కార్డులకు లబ్దిదారులుగాఎంపిక చేశారు. ఇందులో నల్గొండ జిల్లాలో 4,976 సూర్యాపేట జిల్లాలో 2,100 భువనగిరి జిల్లాలో 910 కుటుంబాలను రేషన్ కార్డుల కోసం ఎంపిక చేశారు.

స్టాక్ పాయింట్లకు సన్నబియ్యం వానాకాలం సీజన్లో జిల్లాల్లో సేకరించిన సన్నవడ్లను నూక కాకుండా మూడు నెలల తర్వాత మరాడించడం ప్రారంభించిన అధికారులు, వాటిని స్టాక్ పాయింట్లకు చేరుస్తున్నారు. కొన్ని జిల్లాల్లో సరిపడా ధాన్యం దిగుబడులు రాకపోవడం, ఇంకొన్ని జిల్లాల్లో దొడ్డు వడ్లు ఎక్కువగా పండించడంతో ఆయా జిల్లాలకు ఇతర జిల్లాల నుంచి సన్నబియ్యం తెప్పించి నిల్వచేస్తున్నారు.

సన్న బియ్యం సప్లై తో బ్లాక్ మార్కెట్ కు బ్రేక్..

60 శాతం దొడ్డుబియ్యం పక్కదారి రేషన్ షాపుల ద్వారా ఇప్పటిదాకా పంపిణీ చేస్తున్న దొడ్డు బియ్యాన్ని చాలా మంది తినడం లేదు. సుమారు 60 శాతం బియ్యం పక్కదారి పడుతున్నాయి. రేషన్ షాపుల దగ్గర వ్యాపారులు దొడ్డు బియ్యాన్ని కొనుగోలు చేసి కోళ్ల దాణా, లిక్కర్ తయారీ కోసం తరలిస్తున్నారు. దీంతో సన్న బియ్యానికి డిమాంట్ఎక్కువ కావడంతో రేట్లు బాగా పెరిగిపోయాయి. రేషన్ బియ్యం పక్కదారి పట్టడంతో పాటు లబ్దిదారులు కూడా తినడం లేదన్న విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం రేషన్ కార్డులు ఉన్న వారికి సన్నబియ్యం ఇస్తామని ప్రకటించింది. ఇందులో భాగంగా 2024 వానాకాలం సీజన్లో సన్న వడ్ల పంటను పెంచేందుకు క్వింటాల్ కు రూ.500 బోనస్ ప్రకటించింది. సన్న బియ్యం పంపిణీ చేయడం వల్ల దొడ్డు బియ్యం రీసైక్లింగ్‌కు కూడా అడ్డుకట్ట పడుతుందని అధికారులు పేర్కొంటున్నారు..

నాంపల్లి పీహెచ్‌సీలో కలెక్టర్ తనిఖీ





నవతెలంగాణ-నాంపల్లి

మండలకేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్, ఓపి రిజిస్టర్, ఈడిడి, ఏఎన్‌సితో పాటు అన్ని రిజిస్టర్ లను పరిశీలించారు. ఆస్పత్రిలో ఉన్న ఏడుగురు ఇన్‌పేషెంట్లతో మాట్లాడారు. ఆస్పత్రిలో వైద్య సేవలు ఎలా ఉన్నాయని డాక్టర్ అందర్నీ పరీక్షిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ భవాని మంచి వైద్య సేవలు అందిస్తున్నారని ఇద్దరు పేషెంట్లు కలెక్టర్ కు తెలిపారు. 73 మంది ఓపి పేషెంట్లు వైద్య సేవలు పొందడం పట్ల కలెక్టర్ డాక్టర్ భవానిని, వైద్య సిబ్బందిని అభినదించారు. బాలికల హాస్టల్ కు రెగ్యులర్ గా వెళ్తున్నారా అక్కడ సమస్యలు ఏంటని ప్రశ్నించగా విద్యార్థినిలు చాలామంది రక్తహీనతతో బాధపడుతున్నారని డాక్టర్ భవాని సాగర్ కలెక్టర్ వివరించారు. ఆరోగ్య కేంద్రానికి ఆటో క్లేవ్, ఫీటల్ డాప్లర్ ,సర్జికల్ పరికరాలాలను మంజూరు చేశారు. అనంతరం కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగదితోపాటు, డైనింగు, పరిసరాలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. 5వ తరగతి, 10 వ తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జి .దేవా సింగ్, ఎంపీడీవో రామకృష్ణ శర్మ, ఎంపీఓ, ఝాన్సీ, డాక్టర్ తరుణ్, సిహెచ్ఓ ఏక్ నాథం, సూపర్వైజర్ అంజలి, ఎం ఎల్ హెచ్ పి లు డాక్టర్ దువ్వ నవీన్, కళ్యాణి, సంతోష, తస్లీమా, దీపిక, ప్రశాంతి, ఏ ఎన్ ఎం లు పార్వతి, లక్ష్మమ్మ సంతోష, విజయ లక్ష్మి, సంధ్య, మహాలక్ష్మి, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఐటిఐ కళాశాల నిర్మాణం కోసం స్థల పరిశీలన
కలెక్టర్ ఇలా త్రిపాఠి

చండూరు : చండూర్ మున్సిపాలిటీ పరిధిలోని అంగడిపేట వద్ద ఐటిఐ కళాశాల నిర్మాణం కోసం గుర్తించిన స్థలాన్ని నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం తనిఖీ చేశారు. 361 సర్వే నెంబర్ లో సుమారు 2 ఎకరాల స్థలంలో ప్రతిపాదిత ఐటిఐ కళాశాలను నిర్మించే నిమిత్తం ప్రభుత్వం స్థలాన్ని గుర్తించాలని ఆదేశించిన మీదట జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చండూర్ ఆర్డీవో, తహసిల్దారులు 361 సర్వే నంబర్లో స్థలాన్ని గుర్తించారు. ఆ స్థలాన్ని పరిశీలించి ఐటిఐ కళాశాల ఏర్పాటుకు అనువైన పరిస్థితులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ఆర్ డి ఓ శ్రీదేవి తో మాట్లాడుతూ ఐటిఐ కళాశాల నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలానికి సంబంధించిన పూర్తి వివరాలను సమర్పించాలని ఆదేశించారు. ఆమె వెంట , ఎంపీడీవో బండారు యాదగిరి, తహసిల్దార్ దశరథ, వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.



వీవోఏలకు రూ. 20 వేల కనీస వేతన అమలు చేయాలి

- ఐకేపీ వీఓఏల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు సిహెచ్ లక్ష్మీనారాయణ

నవతెలంగాణ-క్లాక్‌టవర్

తెలంగాణ రాష్ట్రంలో వీవోఏలకు కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన 20వేల వేతన వాగ్దానాన్ని వెంటనే అమలు చేయాలని ఐకేపీ వీవోఏల ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు చినపాక లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ముందు ధర్నా చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ జె శ్రీనివాస్, డిఆర్‌డిఓ పిడి శేఖర్ రెడ్డిలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మహిళ సాధికారత కోసం ప్రభుత్వ పథకాల అమలు కోసం శ్రమిస్తున్న ఐకేపీవీవోఏలకు కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం ప్రకారం 20వేల వేతనం వెంటనే అమలు చేయాలని కోరారు. బకాయి ఉన్న స్త్రీ నిధి ఇన్సెంటివ్, గ్రామ సంఘం నుంచి ఇవ్వవలసిన 3వేలు వెంటనే ఇవ్వాలని కోరారు.సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చిలుముల దుర్గయ్య పొడిచేటి సులోచనలులి మాట్లాడుతూ వీవోఏలు ఎంత కష్టపడి పనిచేసిన టార్గెట్ల పేరుతో సీసీలు, ఏపీఎంలు వేధిస్తున్నారన్నారు. వివిధ కారణాల చేత తొలగించిన వీవోఏను పనిలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు పోలే సత్యనారాయణ యూనియన్ జిల్లా నాయకులు ,కె చంద్రకళ ఎం మంగమ్మ,కె సువర్ణ,కె నగేష్, బి సురేష్, సైదమ్మ పుష్పలత, పాపయ్య, లక్ష్మి, నాగమణి, టి మంజుల, ఎం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు..



అందరికి న్యాయం చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

- ఎంపీఓ కేదార్ నాద్
- తుమ్మడం లో విచారణ

నవతెలంగాణ-నిడమనూరు

ప్రజలందరికీ న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీఓ కేదార్ నాద్ అన్నారు. శుక్రవారం మండలం లోని తుమ్మడం గ్రామం లో గత నేల గ్రామానికి చెందిన కొంత మంది యువకులు షెడ్యూల్ క్యాస్ట్ కి సంబందించిన వారికి ఎలాంటి ప్రతిఫలాలు అందకుండా ఎస్సీ అనే కారణం తో అర్హులైన వారికి కాకుండా బీసీ వర్గాలకు చెందిన వారికే అన్ని ఉద్యోగాలు అందుతున్నాయని ఆరోపిస్తూ జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలమేరకు శుక్రవారం గ్రామం లోని పంచాయతీ కార్యాలయం వద్ద ఆయన విచారణ చేపట్టి మాట్లాడారు. ఎస్సి కులాలకు ఎలాంటి ఉద్యోగాల కల్పన లేదని గ్రామానికి చెందిన జిల్లా రమేష్, కందుకూరి మహేష్ ,దుబాస్ కొండల్ ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఎలాంటి పథకాలు ఉద్యోగాలు గ్రామానికి వచ్చినా అగ్రవర్ణాల వారికే కేటాయించడం వల్ల తమలాంటి నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందని వారు తెలిపారు. విచారణ చేపట్టిన ఎంపీఓ కేదార్ నాద్ గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికి గ్రామ సభలో లో ఎంపిక చేసి బహిరంగగా ప్రజలకు తెలిసేలా కార్యక్రమాలు చేపట్టి అర్హులైన వారికీ న్యాయం చేసే విధంగా చూడాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. విచారణ నివేదికను పై అధికారులకి నివేదించనున్నట్లు తెలిపారు. ఈ విచారణలో గ్రామస్తులు పాల్గొన్నారు.

సాగర్ డ్యాం ఇన్‌చార్జి ఎస్ఈగా మల్లికార్జునరావు

నవతెలంగాణ-నాగార్జునసాగర్



నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఇన్చార్జ్ ఎస్ఈగా బి.మల్లికార్జున రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గత కొంతకాలంగా సాగర్ ప్రాజెక్టు ఎస్ఈగా విధులు నిర్వహించిన నాగేశ్వరరావు ఉద్యోగ విరమణ చేసినప్పటి నుండి ఇన్‌చార్జి ఎస్ఈ ల పరంపర కొనసాగుతుంది. గత కొన్ని నెలల నుండి దిండి ప్రాజెక్టు ఈఈ శ్రీధర్ రావు నాగార్జునసాగర్ డ్యాం ఇన్‌చార్జి ఎస్ఈగా కొనసాగుతున్నారు. శుక్రవారం నుండి శ్రీధర్ రావు వ్యక్తిగత కారణాల చేత సెలవు ల పై ఉన్నందున నాగార్జునసాగర్ డ్యాం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా విధులు నిర్వర్తిస్తున్న మల్లికార్జునరావు సాగర్ ప్రాజెక్ట్ సూపరిండెండెంట్ ఇంజనీరుగా అదనపు బాధ్యతలు తీసుకున్నారు. మల్లికార్జునరావును సాగర్ ప్రాజెక్టు ఏఈ లు, జేఈ లు సిబ్బంది ఘనంగా సన్మానించారు.



రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలని వినతి

నవతెలంగాణ-కొండమల్లేపల్లి

మండల కేంద్రంలోని హార్టికల్చర్ రీసెర్చ్ సెంటర్ ను ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఆధీనంలో రీసెర్చ్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని కోరుతూ మాజీ ఎంపీటీసీ చెనగోని శివ గౌడ్ శుక్రవారం ఢిల్లీలో కేంద్ర మంత్రుల ద్వారా కేంద్ర అగ్రికల్చర్ మినిస్టర్ శివరాజ్ సింగ్ చౌహాన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన సానుకూలంగా స్పందిస్తూ పట్టణంలో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఆస్తి పన్ను చెల్లించండి...
పట్టణాభివృద్ధికి సహకరించండి

- సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్
- వందమందికి పైగా వారికి రెడ్ నోటీస్ జారీ



నవతెలంగాణ-మిర్యాలగూడ

మార్చి 31 లోగా ఆస్తి పన్ను చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ కోరారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడ పట్టణ అభివృద్ధి చెందాలంటే పట్టణ ప్రజలందరూ ఆస్తి పన్ను, నీటి పన్ను బకాయిలను ఈనెల 31 లోగా చెల్లించాలని కోరారు. 15 ఫైనాన్స్ నిధుల కింద పట్టణ అభివృద్ధి జరగాలంటే ఆస్తి పన్ను గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం 10 శాతం ఎక్కువగా వసూలు చేస్తేనే 15 ఫైనాన్స్ నిధులు వస్తాయని లేనియెడల 15 ఫైనాన్స్ నిధులు బ్లాక్ అయ్యే అవకాశం ఉందన్నారు. గత సంవత్సరం మిర్యాలగూడలో 9 కోట్ల రూపాయలు టాక్స్ వసూలు చేయగా ఇప్పటివరకు కేవలం 7 కోట్ల రూపాయల వరకే వసూలు చేసినట్లు తెలిపారు. ఇంకా మూడు కోట్ల రూపాయలను వసూలు చేయాలని రోజుకు 30 లక్షల చొప్పున వసూలు చేసినట్లయితే 15 వ ఫైనాన్స్ నిధులు రీచ్ అయ్యే అవకాశం ఉందన్నారు. పట్టణ అభివృద్ధికి సహకరిస్తేనే అన్ని రకాల సదుపాయాలు కల్పించ వచ్చని పట్టణంలో షాపులు, థియేటర్లు ఓటర్లు కమర్షియల్ బిల్డింగులు యజమానులు ఇప్పటివరకు వందమందికి పైగా 3 లక్షల నుండి 7 లక్షల రూపాయల వరకు ఆస్తి పన్ను బకాయిలు కట్టడం లేదన్నారు. వారికి రెడ్ నోటీస్ కూడా జారీ చేశామని తెలిపారు. ప్రాపర్టీ టాక్స్ లక్షల్లో ఉన్నాయని వారిపై మున్సిపల్ అధికారులు పోలీసులు రెవెన్యూ సిబ్బందితో కలిసి కట్టడి చేపట్టడం జరుగుతుందన్నారు. అమౌంట్ కట్టని షాపులను సీజ్ చేస్తూ వారికి వాటర్, ఎలక్ట్రిసిటీ,శానిటేషన్ వంటి మున్సిపాలిటీ సదుపాయాలు నిలిపి వేస్తామన్నారు. వారిపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. రెడ్ నోటీస్ జారీ చేసిన వారు ఇప్పటికైనా తమ ప్రాపర్టీ టాక్స్‌ను ఆన్లైన్ ద్వారా గాని మున్సిపల్ ఆఫీస్ కి వచ్చి కట్ట వచ్చుని,ప్రాపర్టీ టాక్స్ లో ఎవరికి ఎలాంటి మినహాయింపు లేదని,టాక్స్ ని ఈనెల 31 లోపల కట్టి నట్లయితే 15 ఫైనాన్స్ నిధులు వస్తాయని, మిర్యాలగూడ అభివృద్ధి జరుగుతుందన్నారు. వారి వెంట మిర్యాలగూడ తాసిల్దార్ హరిబాబు ఉన్నారు.

ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు



- మిర్యాలగూడ మండలంలో ఐదుగురు గైర్హాజరు
- పరిశీలించిన సబ్ కలెక్టర్

నవతెలంగాణ-మిర్యాలగూడ

పదవ తరగతి పరీక్షలు శుక్రవారం ప్రారంభం గాక మొదటి రోజు పరీక్షలు ప్రశాంతంగా సాగాయి. మొదటి పరీక్ష తెలుగు జరుగగా మండల పట్టణ వ్యాప్తంగా 12 పరీక్ష కేంద్రాలలో 2737 మంది విద్యార్థులు హాజరు కావాల్సిందిగా 2732 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు ఐదుగురు గై హాజరయ్యారు. పరీక్షల పనితీరును స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఆటంకం జరక్కుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు ఆయన వెంట తహసిల్దార్ హరిబాబు ఎంఈఓ బాలు నాయక్ సిబ్బంది పాల్గొన్నారు

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలోని ఐదు సెంటర్లలో శుక్రవారం నిర్వహించిన మొదటి రోజు పదవ తరగతి తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మండలకేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల 149 విద్యార్థులకు గాను 149, ఎస్‌పిఆర్ హై స్కూల్లో219 విద్యార్థులకు గాను 219, శ్రీ చేతన హై స్కూల్లో105 మంది విద్యార్థులకు 104 మంది హాజరు కాగా ఒకరు గైర్హాజరయ్యారు, జెడ్ పి హెచ్ ఎస్ అమ్మనబోలు పాఠశాలలో63 మంది విద్యార్థులకు గాను 62 మంది హాజరుకాగా ఒకరు గైర్హాజరయ్యారు, అదేవిధంగా జడ్.పి.హెచ్.ఎస్ బి వెల్లంల హై స్కూల్లో72 మంది విద్యార్థులకు గాను అందరు హాజరయ్యారు. మొత్తం విద్యార్థులు 608మంది విద్యార్థులకు 606 మంది విద్యార్థులు హాజరైనట్టు మండల విద్యాధికారి కే .నరసింహ తెలిపారు.

చండూరు : పదవ తరగతి పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలో మూడు సెంటర్లు ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా 634 మంది విద్యార్థులకు గాను మొదటి రోజు తెలుగు పరీక్షకు 634 మంది విద్యార్థులు హాజరయ్యారు. జెడ్పీహెచ్ఎస్ హై స్కూల్లో 195 మంది, గాంధీజీ స్కూల్ సెంటర్లో,220, సన్ షైన్ స్కూల్ లో 219, మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్షలు రాయడానికి లోనికి వెళ్లిన విద్యార్థులు మంచి ర్యాంకులతో బయటకు రావాలని విద్యాశాఖ అధికారి సుధాకర్ రెడ్డి కోరారు. పరీక్షా కేంద్రాల వద్ద అవాంఛనీయ ఘటనలు జరగకుండా 144 సెక్షన్ అమలు చేశారు.

గట్టుప్పల్ జెడ్పీహెచ్ఎస్‌లో 74 మంది విద్యార్థులకు 74 మంది హాజరయ్యారు. మొదటిరోజు తెలుగు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది.ఎంటర్‌ను ఎమ్మార్వో రాములు, ఎంఈఓ అమృతాదేవి,ఎస్సై వెంకట్ రెడ్డి సందర్శించారు.

నాగర్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీ నాగార్జునసాగర్ పరిధిలో పదవ తరగతి పరీక్షలు శుక్రవారం నుండి ప్రారంభమైనాయి. నాగార్జునసాగర్‌లో పదో తరగతి పరీక్షలు గాను రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. హిల్ కాలనీలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో ఏర్పాటుచేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రంలో శుక్రవారం నాడు 200 మంది విద్యార్థిని విద్యార్థులు, హిల్ కాలనీ ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 117 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ప్రారంభమైన మొదటి రోజు 100% విద్యార్థులు హాజరైనట్లుగా నిర్వాహకులు తెలిపారు.

నిడమనూరు : శుక్రవారం ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణం లో జరిగాయి. మండలం లో మొత్తం మూడు పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా మొత్తం 384మంది విద్యార్థులకు గాను 382మంది పరీక్షలకు హాజరైనట్లు మండల విద్యాధికారి లావూరి వెంకన్న తెలిపారు. మండలం లోని నిడమనూరు ఆదర్శ పాఠశాలలో 168కి 167 మంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో 167మందికి 166మంది ముకుందా పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో 49మందికి 49మంది హాజరు కాగా ఇద్దరు పరీక్షకు రాలేదని పేర్కొన్నారు.



పరీక్షలు ప్రారంభమైన రోజే పేపర్ లీకేజీ సెల్ ఫోన్‌లో చక్కర్లు
శాలిగౌరారంల పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన ఆర్డీఓ అశోక్ రెడ్డి

నకిరేకల్ : రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం 10 పరీక్షలు ప్రారంభమయ్యాయి శాలిగౌరారం మండల కేంద్రంలో తెలుగు పేపర్ లీక్ అయిందని సెల్ ఫోన్ లో పేపర్ కు సంబంధించిన జిరాక్స్ కాపీలు చక్కర్లు కొట్టింది. దీంతో నల్గొండ ఆర్డీవో అశోక్ రెడ్డి హుటాహుటిన మండల కేంద్రంలోని గీతాంజలి హై స్కూల్ పరీక్ష కేంద్రాన్ని తహసిల్దార్ యాదగిరి, ఎంపీడీవో జ్యోతిలక్ష్మి సందర్శించి పరిశీలించారు. పేపరు లీకేజీ లేదని నిర్ధారించుకొని అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎస్సై డి సైదులు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు విద్యార్థులు ఎలాంటి అపోహలు లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలని ఆర్డీవో అశోక్ రెడ్డి కోరారు విద్యార్థులు మాస్ కాఫీ ఇంకో పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాలిగౌరారం మండల కేంద్రంలోని మూడు పరీక్ష కేంద్రాలలో 578 మంది విద్యార్థుల గాను ఇద్దరు విద్యార్థులు గైరాజర్ అయినట్లు ఎంఈఓ నాగయ్య తెలిపారు.

ఆశా వర్కర్లకు కనీస వేతనమివ్వాలి



నవతెలంగాణ-కట్టంగూర్

ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు అందించాలని ఆశా వర్కర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తవిటి వెంకటమ్మ డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం కట్టంగూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.అనంతరం వైద్యాధికారి శ్వేతకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల సంఘం మండల అధ్యక్షురాలు చెవుగోని ధనలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యురాలు చెరుకు జానకి, ఆశా వర్కర్లు శోభ, పుష్పాంజలి, రేణుక, పద్మావతి, సునీత, జ్యోతి, మంగమ్మ, పార్వతమ్మ, సుజాత పాల్గొన్నారు.



క్లాక్‌టవర్ : కేంద్ర ప్రభుత్వం ఆశాలకు పారితోషికాల స్థానంలో 26 వేల రూపాయలను కనీస వేతనంగా నిర్ణయించాలని సీటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆశ వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ పిలుపు మేరకు నల్లగొండ పట్టణంలోని లైన్ వాడ, మాన్యంచల్క పానగల్లు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ముందు నిరసన వ్యక్తం చేసి మెడికల్ ఆఫీసర్లకు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీటీయూ జిల్లా నాయకులు అవుట రవీందర్, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎర్ర సౌజన్య, చింత వజ్రమ్మ, కే సువర్ణ, ఎడవల్లి ప్రేమలత, సిహెచ్ వీరభద్రమ్మ, రేణుక, జహీదా, శోభారాణి మమత తదితరులు పాల్గొన్నారు.

చండూరు: ఆశావర్కర్లకు రూ. 26వేల కనీస వేతనంగా నిర్ణయించాలని సీఐటీయూ మండల కన్వీనర్ జెర్రిపోతుల ధనంజయ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆశ వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ పిలుపు మేరకు చండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముంద నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మెడికల్ ఆఫీసర్ కు రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు జ్యోతి, కట్ట పద్మ లలిత,వరలక్ష్మి, నాగమణి, రాణి, జయమ్మ, వేదావతి, మరియమ్మ పరమేశ్వరి, భాగ్యలక్ష్మి, జ్యోతి, భవాని, లక్ష్మి, రాజేశ్వరి, అలివేలు, సుమలత, వెంకటమ్మ, శివలక్ష్మి, అరుణ, రేణుక, ధనమ్మ, సుజాత, అన్నపూర్ణ, జ్యోతితదితరులు పాల్గొన్నారు.

చిట్యాల : ఆశా వర్కర్లకు ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల లోనే



పద్దెనిమిది వేల రూపాయల ఫిక్స్ డ్ వేతనం నిర్ణయించాలని ఆ సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు గంగుల జయమ్మ డిమాండ్ చేశారు.చిట్యాల మండల కేంద్రంలోని పి హెచ్.సి ముందు ఆశా వర్కర్ల యూనియన్ (సిఐటీయు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కు బీజేపీజిల్లా నాయకులు చికిలమెట్ల అశోక్ మద్దతు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ మండల నాయకులు పోశబోయిన సైదమ్మ,పుష్పలత,బాగ్యమ్మ, లక్ష్మి, రేణుక,నీరజ,సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు : గ్రామాలలో గర్భిణీ బాలింతలకు అర్ధరాత్రి ఆపద వచ్చిన అమ్మల అన్ని తనవి చూసుకునే ఆశ లకు నెలకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు వనం నిర్మల కోరారు . శుక్రవారం మండల కేంద్రంలోని మండల వైద్యాధికారికి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మమత, పద్మ,



పుష్పమ్మ కవిత, ధనలక్ష్మి సైదమ్మ, గంగ, జ్యోతి, మమత, నాగమణి, కమలమ్మ, వసుమతి, వరలక్ష్మి, ధర లక్ష్మి అలివేలు, లింగమ్మ ఇందిరమ్మ , కమల, వసంత, సుజాత, రాణి, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

వేములపల్లి : ఆశావర్కర్ల న్యాయమైన సమస్యలు



పరిష్కరించి, కనీస వేతనం 26000 చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకులు రొండి శ్రీనివాస్ డిమాండ్ చేశారు.శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కోడిరెక్క వెంకన్న, నాయకులు వడ్డగాని సైదులు,అయితగాని విష్ణు, ఆశావర్కర్లు రాధిక, లక్ష్మీరజిత, సుజాత, నాగమ్మ, నాగమణి, జయమ్మ, మంగమ్మ పాల్గొన్నారు.

మర్రిగూడ: ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూశుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ముందు మండల ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు.అనంతరం తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని వైద్యాధికారి డాక్టర్ శాలినికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు సల్వోజు రామలింగాచారి, ఆశా వర్కర్స్ యూనియన్ మండల కమిటీ నాయకురాలు మట్టం భాగ్యమ్మ, జంపాల వసంత, ఏర్పుల పద్మ, దుర్గమ్మ సునీత, అనిత, కౌసల్య, ధనమ్మ, యాదమ్మ, పద్మ అరుణ సైదా బేగం, విజయ, బాలమణి, మంజుల, రాణి పాల్గొన్నారు.

కళాశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి



- ముఖ్యమంత్రిని కోరిన ఎమ్మెల్యే సామెల్

నవతెలంగాణ-నూతనకల్

మండల కేంద్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వ జూనియర్ కళాశాలకి సొంత భవన నిర్మాణం కోసం నిధులను మంజూరు చేయాలని కోరుతూ అసెంబ్లీలోనీ ముఖ్యమంత్రి కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డికి తుంగతుర్తి శాసనసభ సభ్యులు మందుల సామెల్ గురువారం వినతి పత్రం అందజేశారు. బడుగు బలహీన వర్గాల పేద విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో విద్యను నభ్యసిస్తున్నారని ,విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సీఎంను కోరినట్లు పేర్కొన్నారు.

ఎంఎస్ కళాశాలలో భగత్ సింగ్ వర్ధంతి సభ

నవతెలంగాణ-కోదాడ టౌన్

సాండర్స్ వధ కేసులో భగత్ సింగ్‌తో పాటు రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను మార్చి 23, 1931న ఉరి తీయబడిన సందర్భంగా.. వారి అమరత్వానికి గుర్తుగా మార్చి 23న ఎంఎస్ కళాశాలలో ఉదయం 10 గంటలకు వర్ధంతి, సంస్మరణ సభను నిర్వహిం చనున్నట్లు ప్రజా చైతన్య వేదిక నిర్వాహకులు పందిరి నాగిరెడ్డి,. డీఎస్.స్వామి, రాయపూడి చిన్ని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బ్రిటిష్ వలసపాలకుల నుండి మాతృదేశ విముక్తికై దేశ ప్రజల్లో చైతన్యాన్ని పెంచి బ్రిటిష్ పాలకుల గుండెల్లో భూకంపం పుట్టించి ఢిల్లీ సెంట్రల్ అసెంబ్లీ హాల్‌లో బాంబ్ విసిరి తమ ప్రజలపై జరిపే దమన నీతిచట్టాలకు భగత్ సింగ్ ఎదురొడ్డి ప్రాణాలర్పించారని తెలిపారు.

ఒకే దేశం- ఒకే భాష-ఒకే ఎన్నిక పేరుతో ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్న మోడీ

- దేశాన్ని తిరోగమనం వైపు తీసుకెళ్తున్న మోడీ సర్కార్
- రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు పథకాలను అమలు చేయడంలో విఫలం
- సీపీఐ(ఎం)రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి

నవతెలంగాణ-సూర్యాపేట

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దేశ ప్రజలకు, సమాజానికి ఎలాంటి ఉపయోగం లేని విధానాలను అవలంబిస్తూ, ఒకే దేశం ఒకే భాష ఒకే ఎన్నిక పేరుతో ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ దేశాన్ని మధ్యయుగాల వెట్టపు తీసుకెళ్తున్నాడని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు అధ్యక్షతన శుక్రవారం స్థానిక ఎంవీఎన్ లో జరిగిన జిల్లా కమిటీ ,మండల కార్యదర్శిల సంయుక్త సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో మూడో సారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్పొరేట్ శక్తులకు ప్రయోజనాలు చేకూర్చే విధంగా పరిపాలన కొనసాగిస్తుందన్నారు. బీజేపీయేతర రాష్ట్రాలపై కక్ష గట్టి అభివృద్ధికి నిధులు ఇవ్వకుండా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలను అప్రతిష్ట పాలు చేస్తుందని అన్నారు. రాష్ట్రాల హక్కులను హరించి వేస్తూ కేంద్రమే పెత్తనం చేయాలని చూస్తుందన్నారు. పెరుగుతున్న ధరలను,నిరుద్యోగాన్ని అదుపు చేయడంలో కేంద్రం పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు. రైతు వ్యతిరేక నల్ల చట్టాల రద్దు కోసం పోరాడిన సందర్భంగా రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయడానికి రైతాంగం ఢిల్లీలో ఆందోళన చేస్తుంటే బుల్లోజర్లతో రైతాంగ ఉద్యమాన్ని అణగదొక్కుతుందని



మండిపడ్డారు. రైతాంగానికి గిట్టుబాటు ధర కల్పించడానికి చట్టం చేయకపోవడం దుర్మార్గం అన్నారు. కార్మిక రంగంలో తీసుకొచ్చిన లేబర్ కోడ్ ల వలన కార్మికుల హక్కులు నిర్వీరమవుతున్నాయని పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాలలో డిలిమిటేషన్ పేరుతో పార్లమెంట్ సీట్ల సంఖ్యను కుదించే ఆలోచనలు విరమించుకోవాలన్నారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం 15 నెలల పాలనలో ఇచ్చిన ఆరు పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేయడం లేదని అన్నారు. ఖజానాలో నిధులు లేవని దాని వల్ల ఆరు గ్యారంటీలు అమలు చేయలేక పోతున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు.గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల మయం చేసిన విషయం తెలిసి కూడా ఎన్నికల హామీలు ఇచ్చి వాటిని అమలు పరచడంలో చిత్తశుద్ధి లేదని అన్నారు. బీసీ రిజర్వేషన్‌లు, ఎస్సీ వర్గీకరణకు శాసనసభ ఆమోదించడం వరకే పరిమితం కావద్దని చిత్తశుద్ధితో వాటిని అమలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో బీజేపీకి ఎనిమిది మంది పార్లమెంట్ సభ్యులు ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి కేంద్రం నుండి రాష్ట్రానికి నిధులు రాబట్టకుండా ఉత్సవ విగ్రహాలుగా మిగిలారని విమర్శించారు. ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిన కేంద్ర మంత్రులు, ఎంపీలు నోరు విప్పకపోవడం సిగ్గుచేటని అన్నారు. రాష్ట్ర విభజన హామీల అమలు చేయడానికి కేంద్ర మంత్రులు చొరవ చూపడం లేదని తెలిపారు. ఇటీవల ఉత్తర తెలంగాణలో జరిగిన ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రలోభాలతో బీజేపీ గెలిచిందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల అమలు కోసం పోరాటాలు తీవ్రతరం చేయాలని, వారి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి ఎండగట్టాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజలను సమీకరించి ఉద్యమాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట గోపి, జిల్లా కమిటీ సభ్యులు మేకన బోయిన శేఖర్,వేల్పుల వెంకన్న, జె.నరసింహారావు, బుర్ర శ్రీనివాస్,కందాల శంకర్ రెడ్డి,పులుసు సత్యం,పల్లె వెంకట్ రెడ్డి, షేక్ యాకొబ్, దుగ్గి బ్రహ్మం,వట్టేపు సైదులు, పాండు నాయక్, మిట్టగడుపుల ముత్యాలు, షేక్ సైదా,బెల్లంకొండ సత్యనారాయణ, జూలకంటి విజయలక్ష్మి,బచ్చలకూరి స్వరాజ్యం, వీరబోయిన రవి, ధనియాకుల శ్రీకాంత్, పార్టీ మండల కార్యదర్శిలు రాపోలు సూర్యనారాయణ,వజ్జే శ్రీను, పోసనబోయిన హుస్సేన్, గుంజ వెంకటేశ్వర్లు, సాయికుమార్,నాగటి చిన్న రాములు,బాలు నాయక్ దేవరకొండ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఏకరూప దుస్తులు తయారు చేయాలి



- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్

నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్

విద్యార్థులకు ఏకరూప దుస్తుల తయారీ జూన్ కల్లా పూర్తి చేయాలని కలెక్టర్ తేజస్‌నంద్ లాల్ పవర్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్లోని కలెక్టర్ సమావేశ మందిరంలో డీఈఓ, డీఆర్‌డీఏ, సంక్షేమ అధికారులతో ప్రభుత్వ పాఠశాలలో, వసతి గృహాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తుల స్టిచ్చింగ్ పై నిర్వహించిన సమావేశంలో అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన ఏకరూప దుస్తులు అందించేందుకు తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పాఠశాలల వారీగా విద్యార్థుల సంఖ్య ప్రకారం విద్యార్థుల కొలతలతో జూన్ నెలలో పాఠశాలలో ప్రారంభం అవుతాయి కావున అన్ని పాఠశాలలకు ఏకరూప దుస్తులు తయారుచేసి అందించే విధంగా ఏపిఎంలు, సీసీలు కృషి చేయాలన్నారు. పాఠశాలల సంఖ్య, పాఠశాలలకు కేటాయించిన ఎస్ హెచ్ జి గ్రూపుల వివరాలు, విద్యార్థుల సంఖ్య తెలుపుతూ ఒక నివేదికను అందజే యాలని తెలిపారు. పాఠశాలల వారీగా రిజిస్టర్ పెట్టి నమోదు చేసి ఎకనాలెడ్జి తీసుకున్న తర్వాతనే క్లాత్ అందజేయాలని తెలిపారు. ప్రతి కుట్టు కేంద్రంలో పదిమంది మహిళలు దుస్తులు తయారు చేసే విధంగా వారికి కాజా మిషన్స్, బటన్స్ కుట్టే మిషన్ కటింగ్ మిషన్లు అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లాలో ఏకరూప దుస్తుల తయారీకి ఎన్ని కుట్టు మిషన్లు ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. ప్రయివేటు వ్యక్తుల చేతికి దుస్తుల తయారీ ఇవ్వవద్దన్నారు, మహిళా సంఘాలు మాత్రమే ఎకరూప దుస్తులు తయారు చేయాలన్నారు. నిర్దేశిత గొడువు లోగా ఏకరూప దుస్తులు అందించే విధంగా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో 37 కేంద్రాలు ఉన్నాయని మొత్తం 475 మంది ట్రైనర్స్ సిద్ధంగా ఉన్నారని ఐపిడి రామ్ సురేష్ తెలిపారు. అలాగే అన్ని మున్సిపాలిటీలలో కూడా సంఘాలకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి ఏకరూప దుస్తుల తయారీ చేయాలని మెప్మా పీడీ రేణుకకు ఆదేశించారు. స్కూల్స్ ప్రారంభం అయ్యే లోపుగా ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించే విధంగా రూపకల్పన చేయాలని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో డిడబ్ల్యూఓ నరసింహరావు, డిఈఓ అశోక్, సంక్షేమ అధికారులు శంకర్, శ్రీనివాస్ నాయక్ ,లత. డీపీఎం ఆంజనేయులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం


కోదాడ టౌన్

- సీఐటీయూ జిల్లా కోశాధికారి వెంకట్ నారాయణ

నవతెలంగాణ-కోదాడ టౌన్

ప్రజల కోసం కార్మికుల కోసం అనునిత్యం పోరాటాలు చేస్తున్న కార్మిక సంఘాల నాయకులను ముందస్తు అరెస్టు చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సీఐటీయూ జిల్లా కోశాధికారి, ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కోటగిరి వెంకట్ నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాదులో బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కరించాలని సంఘటిత సంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు స్కీం వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ప్రయత్నం చేస్తున్న కార్మిక సంఘం నాయకుడు ఎం ముత్యాలు. సీపీఐ(ఎంఎల్) నాయకులు ఉదయగిరితో పాటు జిల్లా వ్యాప్తంగా కార్మిక సంఘం నాయకులను అరెస్టు చేయటానికి తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కరించుకుంటే ప్రభుత్వ వ్యవస్థను దిబ్బందం చేస్తామని వారు హెచ్చరించారు.

మునగాల: ఇందిరాపార్క్ వద్ద జరుగు మహాధర్నాకు తరలివెళ్ళుతున్న భవన నిర్మాణ కార్మికులను శుక్రవారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బచ్చలకూర స్వరాజ్యం మాట్లాడుతూ దర్నాకు వెళు తున్న హమాలి, ట్రాన్స్పో ర్టు,భవన నిర్మాణ కార్మికుల ను అరెస్ట్ చేయటం సరైంది కాదన్నా రు.అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత, వేల్ఫార్ బోర్డు సంక్షేమ పథకాలు అమలు చే యాలని కోరారు.ఈ కార్యక్రమం లో సిఐటియు అనుబంధ సం ఘం బిసిడబ్ల్యూ మండల అధ్య క్షులు షేక్ దస్తగిరి,నాయకులు షే క్ సైదా,షేక్ జాన్ బాషా, బచ్చల కూర వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

నాగారం: ముందస్తు అరెస్టులు హేయమైన చర్యఅని సీపీఐ(ఎం) మండల కన్వీనర్ దేవరకొండ యాదగిరి అన్నారు శు క్రవారం నాగారం మండల కేంద్రం నుండి హైదరాబాదులో జరిగే సీఐటీయూ మీటింగ్ హాజ రుకానున్న నేపథ్యంలో విషయం తెలుసుకున్న స్థానిక పోలీ సులు సీపీఐ(ఎం) నాయకులను ముందస్తు అరెస్టు చేసి స్థానిక పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కన్వీనర్ దేవరకొండ యాదగిరి మాట్లాడుతూ అరె స్టులతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తు న్నారన్నారు. అరెస్టు చేసిన వారిలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు అనంతుల మల్లయ్య సిఐటియు మండల కన్వీనర్ గుడిపూడి వెంకటేశ్వర్లు మంజుల పాల్గొన్నారు.

తిరుమలగిరి : రోడ్డు ట్రాన్స్పోర్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని హైదరాబాద్ ధర్నాకు వెళ్తున్న కార్మికులను అర్ధరాత్రి అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామని సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు కడెం లింగయ్య అన్నారు. శు క్రవారం మండల కేంద్రంలో రోడ్ ట్రాన్స్పోర్ట్ కార్మికులకు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డ్ కార్డు మెడికల్ ఇన్సూరెన్స్, లైఫ్ ఇన్సూరెన్స్ అదేవిధంగా భవన నిర్మాణ కార్మికులకు, వెల్ఫేర్ బోర్డులో పెండింగ్లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు పానగంటి శీను, సీఐటీయూ నాయకులు దాసరి ప్రకాష్ ,నిర్మల యకయ్య, నాగేష్ పాల్గొన్నారు.

పెనపహాడ్ : అక్రమ అరెస్టులతో కార్మిక పోరాటాలను ఆపలేరని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు రణపంగ కృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గుంజ వెంకటేశ్వర్లు అన్నారు. హైదరాబాద్ మహాధర్నాకార్యక్రమానికి వెళ్లకుండా శు క్రవారం తెల్లవారుజామున సీఐటీయూ నాయకులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా నెలకు 2500 ఇస్తామన్న ప్రభుత్వం బడ్జెట్లో కనీసం ప్రస్తావనే లేదు దళితుల సంక్షేమం కోసం అంబేద్కర్ అభయహస్తం ద్వారా దళితులను ఆదుకుంటామని గొప్పలు చెప్పిన ప్రభుత్వం బడ్జెట్లో దీని గురించి ప్రస్తావనే లేదన్నారు. రానున్న కాలంలో సిఐటియు. ప్రజా సంఘాల ద్వారా ప్రజా పోరాటాలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

బొడ్రాయి 7వ వార్షికోత్సవం

- డీఎస్పీ శ్రీధర్ రెడ్డి

నవతెలంగాణ-కోదాడటౌన్



కోదాడ పట్టణంలో గ్రామదేవత నాభిశిల బొడ్రాయి ఏడవ వార్షికోత్సవం శుక్రవారం కమిటీ సభ్యులు వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు మొక్కులు చెల్లించుకునేందుకు బారులు తీరారు. వేద పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ పూజా కార్యక్రమాలని కనుల పండువగ జరిపారు. మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి బిందెలతో జలాభిషేకాలు జరిపి బోనాలు సమర్పించి అమ్మవారికి మొక్కులు చెల్లిం చుకున్నారు. కాగా కోదాడ డీఎస్పీ శ్రీధర్ రెడ్డి బొడ్రాయి వద్ద పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర లారీ అసోసియేషన్ చైర్మన్ రామినేని శ్రీనివాసరావు, శ్రీదేవి దంపతులు పీటలపై కూర్చొని బొడ్రాయి వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించి జలాభిషేకాలు జరిపి అమ్మవారికి తొలి బోనం సమర్పించి మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో బొడ్రాయి పున ప్రతిష్ఠ కమిటీ సభ్యులు, ముత్యాలమ్మ కమిటీ, రైతు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వికలాంగులకు భరోసా ఇవ్వని బడ్జెట్

- బండరాళ్లను నెత్తిపై పెట్టుకొని వికలాంగుల నిరసన

నవతెలంగాణ-ఆత్మకూరు ఎస్



రాష్ట్ర బడ్జెట్లో రాష్ట్రం వికలాంగుల భవిష్యత్తుకు ఎలాంటి భరోసా ఇవ్వలేదని భరోసా భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ అన్నారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ ఆ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని కందగట్లలో బండ రాళ్లను తలపై పెట్టుకోని వినూత్నంగా నిరసన తెలిపి బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 30 లక్షల మంది వికలాంగులు అంగవైకల్యంతో బాధపడుతున్నారన్నారు. ఎన్నికల్లో అధికారంలోకి వస్తే రూ. 6000 పెన్షన్ ఇస్తామని ఆర్టీసీలో వికలాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని ,వికలాంగుల బ్యాక్లాగ్ ఉద్యోగాలను భర్తీ చేస్తామని అనేక హామీలనిచ్చి విస్మరించిందన్నారు. బడ్జెట్ ను సవరించి వికలాంగుల సంక్షేమానికి అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షులు గోగుల శేఖర్‌రెడ్డి సంఘం రాష్ట్ర మహిళా నాయకురాలు గుడిపల్లి సుమతి , తలారి సహదేవుడు, ఆకారపు వెంకన్న, ఓంటేపాక ముత్తయ్య మండల నాయకులు ఆరూరి బాబు, మేకల వెంకన్న ,భువనగిరి వెంకన్న, గుమ్మడిల్లి ఆంజనేయులు, శ్రీరాముల లింగయ్య, జక్కల నరసమ్మ వడ్డేపల్లి మల్లయ్య, గోగుల కలమ్మ లక్ష్మమ్మ, భద్రమ్మ, శ్రవణారెడ్డి, పాల్గొన్నారు.

10వ తరగతి పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ

నవతెలంగాణ-సూర్యాపేట



జిల్లాలో 10వ తరగతి పరీక్షా కేంద్రాలను జిల్లా ఎస్పీ నరసింహ పరిశీలించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ పాటశాల, జెడ్పీ బాలికలు, నెంబర్.2, అంజిలి స్కూల్ లలో పరీక్ష కేంద్రాలను సందర్శించి పరీక్షా సరళి పరిశీలించారు. పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు . పరీక్షా సమయంలో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్‌ను సమర్థంగా నియంత్రించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. విద్యార్థులు పరీక్షలు బాగా రాయాలని, ఎవ్వరూ కూడా అవకతవకలకు పాల్పడవద్దని కోరారు. విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు రావాలన్నారు. పరీక్షా కేంద్రంలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని పేర్కొన్నారు. ఎస్పి వెంట పట్టణ యసై ప్రవీణ్, బందోబస్తు సిబ్బంది ఉన్నారు.

మునగాల: మండలంలో పదవ తరగతి పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈఓ పిడతల వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. మొత్తం 309మంది విద్యార్థులకుగాను 308మంది పరిక్షలకు హాజరై నట్లు తెలిపారు. ఒక్కరు గైర్హాజర్ అయినట్లు చెప్పారు. మునగాల జిల్లా పరిషత్ హైస్కూల్లో 133 మంది. న్యూ ప్రజ్ఞ హైస్కూల్లో175 మంది పరిక్షలు వ్రాసినట్లు తెలిపారు. ఏలాంటి అవకతవకలు మాస్ కాఫి జరగకుండా వుండేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీ సుకున్నారు. పరిక్ష సెంటర్ల సమీ పంలో పోలీసులు144సెక్షన్ అమ లు చేసి పటిష్టమైన చర్యలు చేప ట్టారు.మునగాల సిఐ రామకృష్ణా రెడ్డి, ఎస్ఐ బి. ప్రవీణ్ కుమార్,ప రిక్షా కేంద్రాలను సందర్శించి నిబం ధనలను ఖచ్చితంగా అమలు చేయాలని సూచించారు. పరిక్షా సెంటర్ల వద్ద బందోబస్తులో ఎఎస్ఐ కల్లు శ్రీనివాస రెడ్డి. సిబ్బంది శివ, మున్నీర్ పాల్గొన్నారు.

నూతనకల్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 179 విద్యార్థులకు 177 హాజరయ్యారని విజయ మేరీ ఉన్నత పాఠశాలలో 181 కి 180 మంది హాజరైనట్లు తెలిపారు. మొత్తం 360 మంది విద్యార్థులకు గాను, ముగ్గురు పరీక్షకు గైహాజర్ అయినట్లు మండల విద్యాశాఖ అధికారి రాములు నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షా సమయంలో మాస్ కాఫీ జరగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్ష నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు, మాస్ కాపింగ్ తావివ్వకుండా ఎన్ని జిలేటర్లు తగు జాగ్రత్త తీసుకోవాలని సూచించారు.

చివ్వెంల: 10వతరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు పరీక్షలు జరిగాయి. పరీక్షా కేంద్రానికి ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను అనుమతించాలని రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు విద్యార్థులను అనుమతించారు. పదో తరగతి పరీక్షలకు మొత్తం మండలంలో రెండు సెంటర్లు ఏర్పాటు చేశారు. చివ్వెంల సెంటర్లో 150 మంది విద్యార్థులకు అందరు హాజరయ్యారు. తిరుమలగిరి సెంటర్లో 136 మందికి 133 మంది విద్యార్థులు హాజరయ్యారు. ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. చివ్వెంల సెంటర్ ను ఆర్డీఓ వేణుమాధవ్, తహసిల్దార్ కృష్ణయ్య పరిశీలించారు. పరీక్షా కేంద్రానికి వెళ్లే ముందు చాలామంది విద్యార్థులు సమీపంలోని దేవాలయాలకు వెళ్లి ఆశీర్వాదాలు తీసుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు పహారా కాశారు. బయట వ్యక్తులు లోపటికి వెళ్లకుండా భద్రత ఏర్పాట్లు చేశారు.

కోదాడటౌన్: కోదాడ పట్టణంలో 10వ తరగతి తొలిరోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని కోదాడ మండల విద్యాధికారి సలీం షరీఫ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం 11 సెంటర్లలో 2,343 మందికి గాను 2,339 మంది 99.82శాతం హాజరైనట్లు కేవలం నలుగురే గైర్హాజరైనట్లు తెలిపారు. సెంటర్లవారీగా తేజ స్కూల్ 153 మందికి 153 మంది హాజరు, బాలుర ఉన్నత పాఠశాల 234 మందికి 234 మంది హాజరు, శ్రీ చైతన్య శ్రీనగర్ కాలనీ 198 మంది కి 198 మంది సైదయ్య స్కూల్ 231 మందికి 230 మంది, సిటీ సెంట్రల్ 227 మందికి 227, కేటిఎస్ 240 మందికి 240 మంది, సీసీరెడ్డి 239 మందికి 239 మంది, ఎస్ఆర్ఎం స్కూల్ 167 మందికి 166 మంది జడ్పీ హెచ్ఎస్ గర్ల్స్ 239 మందికి 238 మంది శ్రీ వైష్ణవి స్కూల్ 240 మందికి 240 మంది హాజరైనట్లు తెలిపారు మొత్తం మీద 99.82 శాతం విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. కోదాడ టాలెంట్ స్కూల్ పరీక్ష కేంద్రం అడ్రస్సు తప్పుగా ముద్రించబడి నప్పటికీ విద్యార్థులందరికీ సరైన అవగాహన కల్పించడంతో ఆ సెంటర్లో 100 శాతం విద్యార్థులు హాజరయ్యారు.

సువెన్ సేవలు అభినందనీయం

- కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కోట గోపి

నవతెలంగాణ-మునగాల



విద్యార్థులకు సువెన్ కంపెనీ అందిస్తున్న సేవలు అభినందనీయ మని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కోట గోపి అన్నారు. శుక్రవారం నర్సింహులగూడెం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సువెన్ ఫార్మాసిటికల్ కంపెనీ సహకారంతో అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో షఉట్రై, బెల్టు, నోటుబుక్కు, పరీక్ష పాడ్స్ వంటి స్టడీ స్టేషనరీ పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనురాధ అ ధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థు చదువులో రాణించడం కోసం సువేన్ కంపెనీ అక్షర ఫౌండేషన్ విద్యార్థులకు సేవలు అందించేందుకు ముందుకు రావటం హర్షనీయమన్నారు. విద్యార్థులు ఉన్నత ఆశయాలతో లక్ష్య సాధన వైపు పయనించాలని సూ చించారు.చదువులు మెరుగైన ప్ర తిభ కనబరచడం కోసం ఇలాంటి సేవలను ఉపయోగించుకోవాల న్నారు.జిల్లాలోని మారుమూల గ్రామాల విద్యార్థులను చదువులో వెన్ను తట్టి ప్రోత్సహించడం కోసం సువెన్ ఫార్మసిటికల్ కంపె నీ ఇలాంటి సేవలు చేయడం సంతోషకరమన్నారు. విద్యార్థులకు స్టడీ స్టేషనరీ అందించిన సువెన్ కంపెనీకి అక్షర ఫౌండేషన్ నిర్వాహకులకు పాఠశాల ప్రధానోపా ధ్యాయురాలు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గోళ్ళ మూడి రమేష్ బాబు, తూము శ్రీనివాసరావు, మిట్ట గడుపుల ప్రకా శం,ఏలె హరికృష్ణ, బొల్లేద్దు శ్రీనివా స్ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

చద్దన్నం తింటే సంపూర్ణ ఆరోగ్యం



నవతెలంగాణ-సూర్యాపేట

ప్రతి రోజు చద్దన్నం తినడం వల్ల శరీరానికి ఎన్నో రకాల ప్రయోజనాలు కలుగుతాయని, సంపూర్ణ ఆరోగ్యంతో ఉండవచ్చని మన చద్దన్నం ఫ్రాంచైజ్ నిర్వాహకులు డాక్టర్ భాస్కర్ పసల, ఎస్ క్రాంతి కుమార్‌లు అన్నారు. శుక్రవారం స్థానిక కుడకుడ రోడ్డులో గ్లోబల్ హీలింగ్ సెంటర్ వద్ద వారు మన చద్దన్నం ఫ్రాంచైజ్‌ను ప్రారంభించి మాట్లాడారు. చద్దన్నంతో ఏ కాలంలోనైనా మేలే జరుగుతుందని చెప్పారు. ఎండాకాలంలో మరింత బాగా ఉపయోగపడుతుందన్నారు. చద్దన్నం పేగుల్లో మంచి బ్యాక్టీరియాను వృద్ధి చేస్తుందని తెలిపారు. పేగులను ఆరోగ్యంగా ఉంచటంతో పాటు రోగ నిరోధకశక్తిని కూడా పెంపొందిస్తుందని చెప్పారు. తమ వద్ద నాచురల్ ఆహార పదార్థాలు లభిస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో నిర్వాహకులు వై.గిరి పాల్గొన్నారు.

25న చలో హైదరాబాద్ కార్యక్రమం

నవతెలంగాణ-మోతే

ఈనెల 25న తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిట్యాల రవిచంద్ర శుక్రవారం ఒక ప్రకటన తెలిపారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో సూపరిటెండెంట్ విజయకు సంబంధిత వినతి పత్రాన్ని వినతి పత్రాన్ని అందజేశారు.



విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురి కావొద్దు

- రేస్ ఐఐటి మెడికల్ అకాడమీ చైర్మెన్ బాణాల వసంతా రెడ్డి

నవతెలంగాణ-కోదాడటౌన్

విద్యార్థులు పరీక్షల్లో మానసిక ఒత్తిడికి గురికావొద్దని, దేశ ప్రగతికి విద్యార్థులే మూల స్తంభాలని ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసి, పదవ తరగతి ఫలితాలలో మంచి మార్కులు సాధించాలని రేస్ ఐఐటి మెడికల్ అకాడమీ చైర్మన్ బాణాల వసంతారెడ్డి అభిప్రాయపడ్డారు. శుక్రవారం పది పరీక్షల సందర్భంగా రేస్ అకాడమీ బ్రోచర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు వెళ్తే ప్రగతి సాధిస్తారన్నారు. విద్యపైనే దృష్టి కేంద్రీకరించాలన్నారు.ప్రతి విద్యార్థి నిరంతరం కష్టపడుతూ, ఒత్తిడిలకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని పరీక్షల్లో మంచి ప్రతిభ కనబరిచి కోదాడ పట్టణానికి రాష్ట్రస్థాయిలో పేరు తేవాలని ఆకాంక్షించారు. ఇంటర్మీడియట్ బోధనలో భాగంగా కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు రేస్ ఐఐటి కళాశాల ఎప్పుడు సిద్ధంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ స్వేచ్ఛా రెడ్డి, ప్రిన్సిపాల్ సిరికొండ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ కె శివ శంకర్, తాటికొండ శ్రీనివాస్, వెంకట్, కాశయ్య రాజేంద్రప్రసాద్, సత్యనారాయణ, నాగేశ్వరరావు త్రివేణి, ప్రత్యూష పాల్గొన్నారు.

జలం లేనిదే జీవం లేదు



- ఆర్థిక సామాజిక విశ్లేషకులు బడుగుల సైదులు

నవతెలంగాణ-కోదాడ టౌన్

ఐక్యరాజ్యసమితి లక్ష్యం 2030 నాటికి అందరికీ మంచినీరు, పారిశుద్ధ్యం అనే సుస్థిర అభివృద్ధి సాధన కోసం ప్రతి ఒక్కరం, ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి వృధా చేయకుండా, అవసరానికి తగ్గట్టు ప్రతిరోజు నీటి వినియోగంలో మార్పులు చేసుకోవాలని మార్చి 22 'ప్రపంచ జల దినోత్సవం' సందర్భంగా ఆర్థిక సామాజిక విశ్లేషకులు బడుగుల సైదులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐక్యరాజ్యసమితి 2025 సంవత్సరాన్ని 'అంతర్జాతీయ హిమానీ నదాల సంరక్షణ' ఏడాదిగా ప్రకటించినట్లు తెలిపినారు. ప్రపంచంలో దాదాపుగా 25 శాతం మందికి పరిశుభ్రమైన నీరు అందుబాటులో లేదన్నారు. ప్రజలందరికీ పరిశుభ్రమైన త్రాగునీరు, పారిశుద్ధ్యం అందించడం, నీటి సద్వినియోగం, మంచినీటి వనరుల సంరక్షణ పై ప్రజలలో చైతన్యం తీసుకురావడం ఆధునిక ప్రభుత్వాల ప్రధాన బాధ్యతని తెలియజేశారు.

లింగగిరి శ్రీ సీతారామ చంద్రస్వామి దేవాలయ కమిటీ చైర్మెన్‌గా మంగులు

నవతెలంగాణ-హుజూర్‌నగర్‌రూరల్



మండల పరిధిలోని లింగగిరి గ్రా మంలో గల శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయంకు నూతన పాలకవర్గం ఏర్పాటూ చేస్తూ దేవాలయ శాఖ ఈవో గుజ్జుల కొండారెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా యల్లంశెట్టి మంగులు, సభ్యులుగా మేడి నారాణయమ్మ, ఎలక రాజుల నాగయ్య, కమతం సత్యనారాయణ, స్థానిక అర్చకులు, ముడుంబై దామో దచార్యులు సభ్యులుగా ఉంటారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఈవో కొండారెడ్డి చేతులమీదుగా నియామక పత్రాన్ని అందుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు. దేవాలయ అభివృద్ధికి తన వంతు కృషిచేస్తారని తెలిపారు.

గ్రామాలభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

నవతెలంగాణ-మోతే

గ్రామాలభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ మండల అధ్యక్షులు కీసర సంతోష్ రెడ్డి అన్నారు .శుక్రవారం మండల పరిధిలోని రాఘవాపురం ఎక్స్ రోడ్డు బళ్ళు తండా గ్రామాలలో గ్రామానికి రూ.5లక్షల చొప్పున మంజూరైన ఎనర్జీ ఎస్ నిధులతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు .ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ ముదిరెడ్డి మధుసూదన్ రెడ్డి మండల యూత్ అధ్యక్షులు వెలుగు వీరన్న గ్రామ కార్యదర్శి సంపత్ కుమార్ మాజీ వార్డ్ మెంబర్లు రాచకొండ మనమ్మ సోమయ్య కోలా లక్ష్మి కృష్ణ బట్టి పెళ్లి సైదు లు వేంపల్లి లక్ష్మారెడ్డి మాజీ వార్డు మెంబర్ కొలలింగయ్య మండల ప్రధాన కార్యదర్శి మండవ శ్రీను, బొడ్డు వెంకన్న కారింగుల సైదులు ఉన్నారు.

తైబజార్ వేలంపాట వాయిదా

నవతెలంగాణ-తిరుమలగిరి

మున్సిపాలిటీలో మేకల, గొర్రెల సంత వేలం పాటలో తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన వేల్పుల లింగయ్య రూ 6,40,000 కు వేలం పాట దక్కించుకున్నారని మున్సిపల్ కమిషనర్ యాదగిరి తెలిపారు. అదేవిధంగా తై బజార్ కి నిర్వహించిన వేలం పాటలో ప్రభుత్వం నిర్ణయించిన ధర రాకపోవడంతో మళ్ళీ ఈ నెల 24వ తేదీకి వాయిదా వేయడం జరిగిందని తెలిపారు.

నవతెలంగాణ
యాదాద్రి భువనగిరి
శనివారం | మార్చి 22, 2025 | www.navatelangana.com

వక్ఫ్ బోర్డు భూములను కాపాడాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి జహంగీర్



నవతెలంగాణ-భువనగిరి

రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చేతగానితనం వల్ల యథేచ్ఛగా భువనగిరి జిల్లాలో వందల ఎకరాలు ఆక్రమణ గురవుతున్నాయని వక్ఫ్ భూములను కాపాడే బాధ్యత ప్రభుత్వాన్నిదని, కొంతమంది కబ్జాదారులు, రాజకీయ నాయకుల చేతుల్లో వక్ఫ్ భూములు ఉన్నాయని దీనిని జిల్లా యంత్రాంగం చూసి చూడనట్లుగా వ్యవహరిస్తుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి జహంగీర్ అన్నారు. భువనగిరి పట్టణంలో వక్ఫ్ భూములు అన్యాక్రాంతం అవుతున్నా జిల్లా అధికారులు చేష్టలుడిగి ఉన్నారని అన్నారు. కలెక్టర్ జిల్లా వక్ఫ్ భూముల సమస్య పై అఖిలపక్ష సమీక్ష సమావేశం నిర్వహించాలి అని వారు డిమాండ్ చేశారు.

పరీక్షలు బాగా రాయాలి: కలెక్టర్

నవతెలంగాణ-భువనగిరి



10వ తరగతి పరీక్షలు ప్రారంభం అయిన నేపథ్యంలో శుక్రవారం భువనగిరి పట్టణంలోని గంజ్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని యాదాద్రి భువనగిరి కలెక్టర్ హనుమంత రావు శుక్రవారం సందర్శించారు. పదవ తరగతి పరీక్ష నిర్వహణ తీరును కలెక్టర్ పరిశీలించారు. అన్ని గదులను కలెక్టర్ కలియ తిరిగి ఎలక్ట్రిసిటీ, తాగునీరు తదితర మౌలిక వసతులను క్షుణ్ణం గా పరిశీలించారు. పరీక్ష ల నిర్వహణ పైన చీఫ్ సూపరింటెండెంట్‌కి పలు సూచనలు ఇచ్చారు.. సజావుగా అన్ని పరీక్షలు జరిగేలా మానటరింగ్ చేయాలన్నారు.

ప్రజాసమస్యలే ఎజెండాగా సీపీఐ(ఎం) పాదయాత్ర

- ఈనెల 23న పాదయాత్రను ప్రారంభించనున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ
- మండల వ్యాప్త పాదయాత్రకు శ్రీకారం చుట్టిన సీపీఐ(ఎం)
- ఈనెల 23 నుండి ఆరు రోజులు.. 24 గ్రామాలు, 132 కిలోమీటర్లు పాదయాత్ర



నవతెలంగాణ-రామన్నపేట

స్వాతంత్ర్యం వచ్చి 78 ఏండ్లు గడుస్తోంది. అనేక పార్టీలు అధికారంలోకి వచ్చాయి, పాలన చేశాయి, పాలకులు మారారు, ప్రభుత్వాలు మారాయి అయినా ప్రజా సమస్యలు ఎక్కడికి అక్కడే పేరుకుపోయి ఉన్నాయి. రాజు వచ్చే మొదలాయే అన్న చందంగా ప్రభుత్వాలు వస్తున్నాయి పోతున్నాయి ప్రజా సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉండిపోతూనే ఉన్నాయి. ప్రభుత్వాలు ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ పోతే సమస్యలు కొన్ని గానే ఉంటాయి. అన్ని పెండింగ్ లోనే పెడితే సమస్యలు గుట్టలు గుట్టలుగా మిగులుతాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రామన్నపేట శాసనసభ నియోజకవర్గ కేంద్రంగా 55 సంవత్సరాలు బాసిలింది. ఎంతో చారిత్రాత్మకంగా చరిత్ర ఉన్న ఈ పట్టణం పాలకుల అలసత్వం, అధికారుల నిర్లక్ష్య ఫలితంగా రామన్నపేట మండలం అనేక రకాలుగా వెనుకబడి పోతూ అనేక ప్రజా సమస్యలతో కొట్టుమిట్టాడుతూ ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మండల వ్యాప్త పాదయాత్రకు శ్రీకారం చుట్టిన సీపీఐ(ఎం)

ప్రజలతో మమేకమై నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న సిపిఐ(ఎం) ఆధ్వర్యంలో మండల వ్యాప్త ప్రజా సమస్యలను అధ్యయనం చేసి వాటిని పరిష్కారానికి ప్రభుత్వం పై ఒత్తిడి తేవడానికి ఈనెల 23 నుండి 28 వరకు ఆరు రోజులపాటు 24 గ్రామాలలో 132 కిలోమీటర్లు పాదయాత్ర చేయడానికి ఈనెల 23న మండలంలోని కొమ్మాయిగూడెం గ్రామం నుండి ప్రజా చైతన్య పాదయాత్ర పేరుతో శ్రీకారం చుడుతోంది. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పాదయాత్రను ప్రారంభించనున్నారు. గ్రామ గ్రామాన తిరుగుతూ, ప్రజలను, చైతన్య పరుస్తూ సీపీఐ(ఎం) ప్రజా చైతన్య పాదయాత్ర నిర్వహిస్తుంది.

'అంగట్లో అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని' అన్నచందంగా మారింది మన రామన్నపేట మండల పరిస్థితి. పాత తాలుకాగా, నియోజక వర్గ కేంద్రంగా వెలసిల్లిన రామన్నపేట నేడు పాలకుల నిర్లక్ష్యానికి, ప్రభుత్వాల వైఫల్యానికి నిలువెత్తు నిదర్శనమైనది. మండలంలో కనీస మౌళిక వసతులు లేక గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంటున్నవి. ప్రధానమైన విద్యా, వైద్యం, ఉపాది లేక దూర ప్రాంతాలకు పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి నిర్మించి 60 ఏండ్లు కావొస్తున్నా.. కనీసం సౌకర్యాలు లేక, నాణ్యమైన వైద్యం అందని ద్రాక్షలా మారింది. ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరి కూలిపోతుంది. మండలంలో చిన్ననీటి వనరులైన ధర్మారెడ్డి పల్లి, పిలాయిపల్లి కాల్వలు దశాబ్దాలు గడుస్తున్నా పూర్తి కావడం లేదు. ఎన్నికల ముందు అనేక పార్టీలకు ప్రచారాస్త్రంగా, గెలిచిన తర్వాత ప్రతిపక్షాలకు పోరాట వస్తువుగా, వెరసి ఒక రకమైన పర్యాటక కేంద్రంగా మారిందని ప్రజలు భావిస్తున్నారు. ప్రధానమైన మూసీ విషపు కాలుష్యపు నీటి ద్వారా పంటలు పండిచగా ప్రజా ఆరోగ్యం దెబ్బతిని ప్రమాదకరమైన రోగాలు వస్తూనే ఉన్నాయి. మూసీ కాలుష్య నీటికి ప్రత్యామ్నాయంగా బస్వాపురం ప్రాజెక్టు ద్వారా గోకారం చెరువును మినీ రిజర్వాయర్ చేసి మండలంలో అన్ని గ్రామాల చెరువులు, కుంటలు నింపాలని ప్రజా డిమాండ్ పెరుగుతోంది. దశాబ్దాలుగా బి.టి. రోడ్లకు నోచుకోని లింకు రోడ్లు వెంటనే పూర్తి చేసి, కనీస మౌళిక సదుపాయాలు కల్పించాలి. మండలంలో సన్న, చిన్న కారు రైతులు, వ్యవసాయ కూలీలు, వృత్తిదారులు అధికంగా ఉన్నారు. ఉపాధి లేక వివిధ ప్రాంతాలకు వలస పోతున్నారు. మండలంలో ఏ ఒక్క గ్రామానికి బస్సు సౌకర్యం లేక విద్యార్థులు మండల కేంద్రంలోని కళాశాలలకు రాలేక చదువు మధ్యలోనే మానేస్తున్నారు. 100 సంవత్సరాల క్రితం నిర్మించిన ఆసీఫ్ నహర్ కాల్వ శిథిలావస్థకు చేరి కట్టలు తెగిపోతూ పంటలు ధ్వంసం అవుతున్నాయి. కావున మండల వ్యాప్త ప్రజా సమస్యలపై ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడి 12ఏండ్లు గడుస్తున్నా మతం పేరుతో మనుషుల మధ్య వైశమ్యాలు సృష్టిస్తుందని, నిత్యావసర వస్తువుల ధరలు పెంచి ప్రజలపై భారాలు మోపుతుందని, ఉపాది హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తూ గ్రామాల్లో పనులు కల్పించక మోసం చేస్తుందని, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించక, ఎరువుల ధరలు పెంచి రైతాంగాన్ని నిర్వీర్యం చేస్తుందని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు, ప్రతీ వ్యక్తి ఖాతాలో 15 లక్షల రూపాయలు జమ అని చెప్పి ప్రజలను మోసగించిందని ఆరోపిస్తూ పాదయాత్రకు సిద్ధమవుతోంది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారెంటీల పేరుతో గద్దెనెక్కి గ్రామపంచాయతీ పాలక వర్గాల కాలం ముగిసినా నేటికి సంవత్సరంనర అవుతున్నా ఎన్నికల విషయంలో కాలయాపన చేస్తుండటంతో గ్రామాల్లో పరిపాలన, పారిశుద్ధ్యం, అభివృద్ధి అస్తవ్యస్తంగా మారింది. గ్రామ సభలు, దరఖాస్తుల పేరుతో కాలంవెల్లదీస్తూ సంక్షేమ పథకాలను అమలు పరచడం లేదని, రేషన్కార్డులు, పింఛన్లు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ బరోసా, రైతు బరోసా వెంటనే అమలు చేయాలని, గ్రామాల్లో త్రాగునీరు, సాగు నీరు అందించి రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేసి, ప్రజా సమస్యలు పరిష్కరించాలని పాదయాత్ర బృందం డిమాండ్ చేస్తుంది. ఈనెల 27న ముగింపు సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం ముందు మహాదర్నాను నిర్వహించబోతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం పరిష్కారం కోసమే ప్రజాచైతన్య పాదయాత్ర: సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం

మండలంలోని 24 గ్రామాలు 16 ఆవాస గ్రామాలలో ప్రజా సమస్యలు కొక్కొక్కలుగా దశాబ్దాల తరబడి పేరుకుపోయి ఉన్నాయి. వాటి పరిష్కారం కోసమే ఆరు రోజులపాటు 132 కిలోమీటర్లు సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో ప్రజా చైతన్య పాదయాత్ర నిర్వహిస్తున్నాం. గుర్తించిన ప్రజా సమస్యలను అధ్యయనం చేయడం ప్రజల ద్వారా మరిన్ని సమస్యలను తెలుసుకుని ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి ఈ పాదయాత్ర ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈనెల 23న పాదయాత్ర ప్రారంభించడానికి కొమ్మాయిగూడెం గ్రామానికి సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ రానున్నారు. ఈనెల 28న తహసిల్దార్ కార్యాలయం వద్ద మహా ధర్నా కూడా ప్రజలను సమీకరించి నిర్వహించబోతున్నాం. ఈ మహా ధర్నా కార్యక్రమానికి సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చేరుపల్లి సీతారాములు జిల్లా కార్యదర్శి మహమ్మద్ జహంగీర్ రానున్నారు. రైతులు, కార్మికులు, విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళలు, ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ ప్రజా చైతన్య పాదయాత్ర విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

తిరందాసు గోపి విజ్ఞాన కేంద్రం భావితరాలకు ఉపయోగం

- సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు



నవతెలంగాణ-భువనగిరి

తిరందాసు గోపి విజ్ఞాన కేంద్రం ప్రస్తుత భావితరాలకు విజ్ఞాన బండాగారాలుగా ఉపయోగ పడతాయని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు తెలిపారు. గురువారం భువనగిరిలో తిరందాసు గోపి విజ్ఞాన కేంద్ర భవన నిర్మాణానికి సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరందాసు గోపి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఇప్పటికే గ్రంథాలయం నడుస్తుందన్నారు. విద్యార్థులు పోటీ పరీక్షలు నిమిత్తం గ్రంథాలయానికి వచ్చి అందుబాటులో ఉన్న పుస్తకాలతో ప్రిపేర్ అవుతున్నారని తెలిపారు. విజ్ఞాన కేంద్రం ద్వారా స్పోకెన్ ఇంగ్లీష్, కరాటే, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. ఈ భవనాన్ని సంవత్సరం లోపు పూర్తి చేయాలని ఆకాంక్షించారు. ఈ భవన నిర్మాణానికి, పార్టీ శ్రేణులు, ప్రజలు, మేధావులు, వ్యాపారులు సహకరించాలని కోరారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ మాట్లాడుతూ తిరందాస్ గోపి ఆశయాలను, ఆలోచనలను ప్రజలకు వివరించడానికి ఈ విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్ మాట్లాడుతూ తిందాసు గోపి విజ్ఞాన కేంద్ర భవనాన్ని నిర్మాణం చేయడానికి కృషి చేస్తున్న తిరందాసు గోపి ట్రస్ట్ సభ్యులకు అభినందనలు తెలిపారు. సీఐటీయూ విభాగం తరఫున తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరందాసు గోపి ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు గద్దె నరసింహ, కొండమడుగు నరసింహ, ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు,కల్లూరి మల్లేశం, దాసరి పాండు, సంగు నరేందర్, ప్రజానాట్యమండలి కళాకారులు, జిల్లా, పట్టణ, మండల నాయకులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు గొప్పవరం- రాజీవ్ యువ వికాస పథకం

- మున్సిపల్ మాజీ చైర్మెన్ బర్రె జహంగీర్



నవతెలంగాణ-భువనగిరి

రాజీవ్ యువ వికాసం కింద దరఖాస్తు కేంద్రాన్ని మున్సిపల్ మాజీ చైర్మెన్ బర్రె జహంగీర్ 8వ వార్డులో శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. కుల మతాలకతీతంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువతకు ఈ దేశ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ రాష్ట్రంలోని నిరుద్యోగ యువకులకు ఇచ్చిన మాటకు కట్టుబడి రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు బాగ లేకపోయినా స్వయం ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు నాయకత్వంలో, కుంభం అనిల్ కుమార్ రెడ్డి స్థానిక శాసనసభ్యులు ఆదేశం సారం కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్‌యువ వికసం పథకాన్ని ప్రారంభించడం నిరుద్యోగులకు వరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు భువనగిరి మున్సిపల్ పట్టణంలోని 8వ వార్డులో రాజేందర్ నగర్ జాంఖాన్ గూడెం చౌరస్త నిరుద్యోగులకు ఉపాధి అవకాశం కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో దరఖాస్తులను ఆన్ లైన్ చేసుకోవడం కోసం దరఖాస్తు కేంద్రాన్ని ప్రారంభించారు. యువతకు అందుబాటులో ఉండేందుకు కాంగ్రెస్ అధ్వర్యంలో దరఖాస్తు కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందని ఆసక్తి కలిగిన యువత ఆధార్ కార్డు,కాస్ట్, ఇన్కమ్, పాస్పోర్ట్ సైజ్ ఫోటో సంబంధించిన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఉడత రమేష్, గోపే శివ, ఎండి ఇఫ్తాకార్, సిరిపంగ నాగరాజు, కూర శివకుమార్, ఎండి అఖిల్, చందుపట్ల విశ్వేశ్వరరావు, కడారి నరేష్, బత్తుల బాబు, కూర నాగేందర్, మహిళా సంఘం సభ్యురాలు ఇట్టబోయిన పావని, భాను పాల్గొన్నారు.

ఇంటి పన్నుల చెల్లింపులపై జాగ్రత్తగా ఉండాలి

నవతెలంగాణ-భువనగిరి

పట్టణ ప్రజల ఆస్తి పన్ను వసూళ్ల విషయంపై కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఫేక్ కాల్స్ చేసి ఇంటి పన్ను యొక్క బకాయిలపై ప్రత్యేక డిస్కౌంట్ ఇచ్చి తక్కువ చేసి చెల్లింపు చేసుకుంటావని వారి యొక్క వ్యక్తిగత అకౌంట్లోకి డబ్బులు పంపించండి అని చేస్తున్న ఫోన్స్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. అటువంటి ఫేక్ కాల్స్ రెస్పాండ్ అవ్వకూడదని, తప్పని సరిగా మా య్యొక్క పురపాలక సంఘ కార్యాలయం బిల్ కలెక్టర్లు లేదా సిబ్బందికి లేదా మీసేవ కేంద్రాల వద్ద లేదా ఆన్ లైన్ ద్వారా మాత్రమే ఆస్తి పన్నును చెల్లించవలెనని కోరారు.

ఉపాధి కూలీలకు కనీస వసతులు కల్పించాలి

- వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసచారి

నవతెలంగాణ-సంస్థాన్ నారాయణపురం

ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న కూలీలకు పని ప్రదేశంలో కనీస వసతులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జి.శ్రీనివాసచారి కోరారు. శుక్రవారం మండలంలోని గొల్లగూడెం గ్రామ సమీపంలో కూలీలు చేస్తున్న ఉపాధి హామీ పనులను వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పరిశీలించారు.రోజు కూలీ ఎంత పడుతుందో తెలుసుకునేందుకు పేస్లిప్ ఇవ్వడం లేదన్నారు. కూలీలు ఆవేదన చెందుతున్నారన్నారు. ఎండలో పని చేస్తున్నా పని ప్రదేశంలో నీడ,నీళ్ల వసతి కల్పించడం లేదన్నారు. కూలీలకు కనీస వసతులు కల్పించాలన్నారు. రోజుకు రూ.600లు కూలి చెల్లించాలన్నారు. సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు చింతకాయల నరసింహ,కుక్కల అంజయ్య,చింతకాయల లింగస్వామి, చింతకాయల సత్తయ్య, పొదిలి నరసింహ, గుడిపల్లి బుగ్గమ్మ జక్కర్తి దుర్గమ్మ,దోటి కవిత, దోటివిజయ,శ్రీరాముల మొత్తమ్మ, గుడిపల్లి జంగమ్మ,బంటు అనిషా, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు

నవతెలంగాణ-భువనగిరి

యాదాద్రి భువనగిరి జిల్లాలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో ప్రారంభమయ్యాయి. జిల్లా కలెక్టర్‌తో పాటు విద్యాశాఖ అధికారులు పరీక్షా కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు ఇతర అంశాలపై పరిశీలించి పలు సూచనలు చేశారు. పరీక్షలకు జిల్లాలో 8627 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా అందులో 8616 మంది హాజరయ్యారు.11 మంది గైరాజరయ్యారు. పరీక్షల కేంద్రాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పేదల పక్షాన నిలిచిన నాయకుడు జోగిరెడ్డి

- సంతాప సభలో సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు

నవతెలంగాణ-మోటకొండూరు

మండలంలోని తేర్యాలగ్రామంలో కామ్రేడ్ సీనియర్ నాయకులు దొంతి జోగిరెడ్డి పదవ రోజు సంతాపసభకు సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు హాజరై వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళలర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జోగిరెడ్డి కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో నిబద్ధత గల నాయకుడని తేర్యాల గ్రామంలో మూడు పర్యాయములు పార్టీ నాయకుడిని సర్పంచిగా గెలిపించి హరిజనులకు సీలింగ్ భూమి 42 ఎకరాల భూమిని పంపిణీ చేయించి పట్టాలు ఇప్పిచారన్నారు. ఈ సంతాప సభ శనిగల భాగ్యమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి గాదేగాని మాణిక్యం, ఎండి శంషుద్దీన్ ,జైపాల్ రెడ్డి, దొంతి కమలాకర్ రెడ్డి, దామోదర్ రెడ్డి, పల్లెపాటి వంశీ శంకరయ్య, శీను, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్వోపై సస్పెన్షన్ పట్ల హర్షం

నవతెలంగాణ-బీబీనగర్



విధినిర్వహనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన బీబీనగర్ ఎమ్మార్వో శ్రీధర్‌ని జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేయడాన్ని హర్శిస్తున్నామని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కోమటిరెడ్డి చంద్ర రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు, జిల్లాలో రెవెన్యూ డిపార్ట్మెంట్‌తో పాటు ఇతర డిపార్ట్మెంట్లలో అలసత్వాన్ని ప్రదర్శిస్తు అవినీతికి పాల్పడుతున్న అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.


తహసీల్దార్‌పై కలెక్టర్ సస్పెన్షన్ వేటు

- ఖాళీ స్థలానికి పాసు పుస్తకం జారీచేసిన తహశీల్దార్ శ్రీధర్

నవ తెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

బీబీనగర్ మండలంలోని పడమట సోమారం గ్రామంలో ఖాళీ స్థలానికి పాసుబుక్‌ను తహసీల్దార్ శ్రీధర్ జారీ చేశారు. కాగా పాసుబుక్కు జారీ చేసే విషయంలో క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండా పాసుబుక్ జారీ చేయడంతో కలెక్టర్ విచారణ జరిపి, బీబీనగర్ తహశీల్దార్ శ్రీధర్‌ని సస్పెండ్ చేస్తూ శుక్రవారం కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. రెవెన్యూ అధికారులు తప్పిదాలు చేస్తే కఠిన చర్యలు తప్పు అని హెచ్చరించారు.

సీఐటీయూ జిల్లా అధ్యక్షులు దాసరి పాండు అరెస్ట్



నవతెలంగాణ-భువనగిరి

రాష్ట్రవ్యాప్తంగా హమాలీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ కార్యక్రమం విజయవంతం చేయడానికి కార్మికులను సిద్ధం చేస్తుంటే సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దాసరి పాండును పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా దాసరి పాండు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం శాంతియుత పద్ధతిలో చలో హైదరాబాద్ కార్యక్రమాలు నిర్వహిస్తుంటే పాలక ప్రభుత్వం పోలీసులతో అణిచివేయడానికి సిద్ధమవుతుందన్నారు. ప్రజాస్వామ్యానికి తిలోదకాలు ఇస్తుందన్నారు. అణచివేతలతో, నిర్బంధాలతో పోరాటాలను ఉద్యమాలను ఆపలేరని మరింత ఉధృతం అవుతాయని తెలిపారు. హమాలి కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు సిఐటియు అలుపెరుగని పోరాటం చేస్తుందని తెలిపారు.

జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలి

నవ తెలంగాణ-ఆలేరు టౌన్

జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న జిల్లాగా నామకరణం చేయాలని, సర్దార్ సర్వాయి పాపన్న సేన నాయకులు పంజాల శ్రవణ్ కుమార్ గౌడ్ అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న సేన ఆధ్వర్యంలో చలో జనగామ కార్యక్రమంలో భాగంగా ఉప్పల్ చౌరస్తా అంబేద్కర్ విగ్రహం దగ్గర నుంచి జనగామ కు బయలుదేరిన పాపన్న సేన సభ్యులు సినీ హీరో పంజాల జైహింద్ గౌడ్ ని, ఆలేరు మండల కేంద్రంలో శుక్రవారం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పుట్ట మల్లేష్ గౌడ్, ఆరేప్రశాంత్ గౌడ్, పల్లె నరసింహులు గౌడ్ ,మొరిగాడి చంద్రశేఖర్ గౌడ్, పులిపలుపుల మహేష్ గౌడ్, బీస కృష్ణంరాజు గౌడ్ ,సీస సత్తయ్య గౌడ్, పల్లె మహేష్ గౌడ్, మొరిగాడి మల్లేశం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నీటి సమస్యను పరిష్కరించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి

నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్

చౌటుప్పల్ మండలం మందోల్లగూడెం గ్రామపంచాయతీ పరిధిలో తూర్పుగూడెం ఆర్ఆర్ కాలనీలో మంచినీటి సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం సీపీఐ(ఎం) పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో త్రాగునీరు లేక ప్రజలు ప్రైవేట్ వ్యక్తుల ద్వారా ట్రాక్టర్లతో కొనుక్కునే పరిస్థితి ఏర్పడిందని దుయ్యబెట్టారు. కుంటగండి చెరువు కట్టపై బోరు వేసి ఆంజనేయులు గుడి వద్ద ఉన్న ట్యాంకును నింపి ఆర్ఆర్ కాలనీవాసులకు మంచినీరు అంది వచ్చాను తెలిపారు. తక్షణమే ఆర్ఆర్ కాలనీ వాసులకు తాగునీరు అందివ్వాలని గ్రామపంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, మండల కమిటీ సభ్యులు కొండే శ్రీశైలం, మాజీ ఎంపీటీసీ వెంకటేశం, గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు ఇట్టబోయిన శేఖర్, చప్పిడి రాఘవరెడ్డి, నూనె సాలయ్య, మంద బుచ్చయ్య, శ్యాంప్రసాద్ రెడ్డి, యాట మల్లేశం, పాపగళ్ళ శంకరయ్య, నరసింహ అంజయ్య లింగస్వామి, రాంనరసయ్య, గోపమ్మ, శంకరయ్య పాల్గొన్నారు.

500 కోళ్లు ఆకస్మికంగా మృతి



నవతెలంగాణ-భూదాన్ పోచంపల్లి

పౌల్ట్రీ ఫామ్‌లో 500 కోళ్ల మృతి చెందడంతో స్థానికులు అధికారులకు సమాచారం అందించారు. శుక్రవారం దోతిగూడెం విలేజ్ పోచంపల్లి మండలం నందు శ్రీనివాస పౌల్ట్రీ ఫామ్ సుదర్శన్ రెడ్డి పౌల్ట్రీ ఫామ్‌లో 500 కోళ్ల ఆకస్మాత్తుగా మృతి చెందినవని, వెంటనే పౌల్ట్రీ ఫార్మ్ ఓనర్ సుదర్శన్ రెడ్డి పివిసి పోచంపల్లి డాక్టర్ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా.. వెంటనే డాక్టర్ స్పందించి పౌల్ట్రీ ఫార్మ్‌ను విసిట్ చేసి చనిపోయిన కోళ్లను పరీక్షించి, అందులో ఒక నాలుగు కోళ్లను వెటర్నరీ బయోలాజికల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ హైదరాబాద్‌కి తదుపరి వ్యాధి నిర్ధారణ కొరకు పంపడం జరిగింది. స్టేట్ లెవల్ ఇన్స్టిట్యూట్ వాళ్ల నేషనల్ లెవెల్ హై సెక్యూరిటీ అనిమల్ డిసీస్ భూపాల్ మధ్యప్రదేశ్ స్టేట్‌కి ఈ చనిపోయిన కోళ్ల శాంపుల్స్‌ని తదుపరి వ్యాధి నిర్ధారణ కోసం మధ్యప్రదేశ్ భోపాల్ పంపడం జరిగింది. ఈ ల్యాబ్ వారు వీబీఆర్ఐ ఇన్స్టిట్యూట్ పంపించిన శాంపుల్స్‌ని టెస్ట్ చేసి బర్డ్ ఫ్లూ పాజిటివ్గా కన్ఫర్మ్ చేయడం జరిగింది. కన్ఫర్మ్ చేసిన తర్వాత తదుపరి గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నుంచి డైరెక్టర్ తెలంగాణ స్టేట్ గవర్నమెంట్‌కు బర్డ్ ఫ్లూ పాజిటివ్ రిపోర్ట్ పంపించి నెక్స్ చేయవలసిన నివారణ చర్యలు శాస్త్రీయ పద్ధతి ప్రకారం చేయమని ఆదేశించడం జరిగింది. తదుపరి డైరెక్టర్ నుంచి వచ్చిన రిపోర్టు ప్రకారం కలెక్టర్‌కి చూపించి వారి నోటిఫికేషన్ ద్వారా శుక్రవారం పి.సుదర్శన్ రెడ్డి పౌల్ట్రీ ఫార్మ్‌ని సందర్శించి, మొదట పౌల్ట్రీ ఫామ్‌లో ఉన్న కోళ్ళని మొత్తం లెక్కించి, తర్వాత వాటిని చంపడం జరిగింది. పౌల్ట్రి ఫామ్‌లో ఉన్న గుడ్లను, పౌల్ట్రీ ఫీడ్‌ని లెక్కించి ప్రొసీజర్ ప్రకారం డిస్పోస్ చేశారు. ఈ ప్రోగ్రాం మొత్తం డాక్టర్ జానయ్య, జిల్లా పశువైద్యాధికారి ఆధ్వర్యంలో అసిస్టెంట్ డైరెక్టర్స్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్, ఇతర పశువైద్య సిబ్బంది మొత్తం 32 రాపిడ్ రెస్పాన్స్ టీములుగా ఏర్పడి ఈ ప్రోగ్రామ్‌ని నిర్వహించారు. ఈ ప్రోగ్రాంలో హెల్త్ డిపార్ట్మెంట్ సిబ్బంది, రెవిన్యూ డిపార్ట్మెంట్ సిబ్బంది, పంచాయతీ రాజ్ సిబ్బంది మరియు పోలీస్ డిపార్ట్మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టపాక నుండే వాటర్‌షెడ్ యాత్ర ప్రారంభం

- యాదాద్రిభువనగిరి జిల్లా జాయింట్ కలెక్టర్ వీరారెడ్డి



నవతెలంగాణ-సంస్థాన్ నారాయణపురం

నీటికి నడక నేర్పే కార్యక్రమమే వాటర్ షెడ్ కార్యక్రమం అని యాదాద్రి భువనగిరి జిల్లా జాయింట్ కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. ప్రధానమంత్రి కృషిసంచాయి యోజనలో భాగంగా వాటర్ షెడ్ కమిషనర్ నరసింహులుతో కలిసి శుక్రవారం జాయింట్ కలెక్టర్ మండలంలోని పుట్టపాక గ్రామంలో వాటర్ షెడ్ యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. పరుగెత్తే వాన నీటికి నడక నేర్పింది వాటర్షెడ్ పథకమేనన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వాటర్ షెడ్ కార్యక్రమం రూపొందించబడిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వర్షపాతం మీదనే ఆధారపడి వ్యవసాయం చేయడంతోనే వ్యవసాయం చేసే వారి సంఖ్య తగ్గుతూ వస్తుందన్నారు. అంతకుముందు వాటర్ షెడ్ జాయింట్ కమిషనర్ నరసింహులు మాట్లాడుతూ నీటిని పద్ధతిగా వాడితే కరువును పారద్రోలవచ్చన్నారు. వాటర్ షెడ్ పథకం ద్వారా ఐదు సంవత్సరాలలో మండలాన్ని కరువు రహిత మండలంగా తీర్చిదిద్దవచ్చన్నారు. రాష్ట్రంలో వర్షాపాతం 914 మిల్లీ మీటర్లు కాగా సంస్థాన్ నారాయణపురం మండలంలో 540 మిల్లీమీటర్లు మాత్రమే నమోదు అయిందని వెల్లడించారు. అంటే రాష్ట్ర వర్షాపాతంలో కనీసం 40 శాతం కూడా మండలంలో నమోదు కాలేదన్నారు. అంతేకాకుండా నిరుపేద మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో వాటర్ షెడ్ కార్యక్రమంలో భాగంగా రూ.1 కోటి 38 లక్షలను 281 మంది మహిళలకు వడ్డీ లేకుండా 50వేల చొప్పున రుణాలు ఇచ్చామన్నారు. అనంతరం గ్రామంలో శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు.మొక్కలను నాటారు. వాటర్ షెడ్ కార్యక్రమంలో భాగంగా రూ.6 లక్షల వ్యయంతో నిర్మించే చెక్కు డ్యామ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వాటర్ షెడ్ యాత్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి నాగిరెడ్డి,జిల్లా అటవీ శాఖ అధికారిణి పద్మజారాణి,జిల్లా భూగర్భ జలశాఖ అధికారి జ్యోతి కుమార్,స్థానిక తహసీల్దార్ ఎం.కృష్ణ,ఎంపీడీవో ప్రమోద్ కుమార్,ఎంపీఓ నరసింహారావు,ఏవో వర్షిత, ఏపీఎం యాదయ్య,ఏపీవో ప్రశాంతి,వాటర్ షెడ్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటే వజ్రాయుధం



- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కల్లూరు మల్లేశం

నవ తెలంగాణ-ఆలేరుటౌన్

ప్రజాస్వామ్య పరిరక్షణ కొరకు ఓటే వజ్రాయుధమని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కల్లూరు మల్లేశం అన్నారు. ఆలేరు మండలం శర్బనపురం గ్రామంలో స్థానిక ఎన్నికలు-ఓటరు చైతన్యంపై ప్రజానాట్యమండలి యాదాద్రి భువనగిరి జిల్లా ఆధ్వర్యంలో కళారూపాలు శుక్రవారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శవర్గ సభ్యులు కల్లూరి మల్లేశం, ఆలేరు మండల కార్యదర్శి దూపటి వెంకటేష్ లు మాట్లాడుతూ రాజకీయాలు పూర్తిగా డబ్బుమయమై, స్వార్థపూరితమైనయని అన్నారు. ఓటు వేసే ప్రజలను పాలకులు చిన్న చూపు చూస్తూ, తమ బానిసలుగా భావిస్తూ డబ్బులు ఇస్తే మద్యం పోస్తే తాయిలాలిస్తే ఓటు వేస్తారని భావిస్తున్నారని చెప్పారు. ఈ సంస్కృతి పోవాలంటే ప్రజలలో ఓటు హక్కును స్వతంత్రంగా, ఎవరి ప్రలోభాలకు గురికాకుండా నిస్వార్థంగా వినియోగించాలి. అప్పుడే ప్రజాస్వామ్యం పరిడవిల్లుతుంది అని అన్నారు. 15 రోజులపాటు కళారూపాలు ప్రదర్శిస్తున్న ప్రజానాట్యమండలి యాదాద్రి భువనగిరి జిల్లా టీముకు అభినందనలు తెలిపినారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి వర్గ సభ్యులు సూద గాని సత్యరాజయ్య, శాఖ కార్యదర్శి కారే రాజు,శర్బనాపురం మాజీ సర్పంచులు సైదాపురం నరసయ్య సూదగాని నరసమ్మ, సీనియర్ నాయకులు బుగ్గ ఎర్రయ్య, పిఎన్ఎమ్ జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు , శివ, ఎస్ ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియా రాజు, బద్దం ముత్తిరెడ్డి, సూదగాని మల్లేష్, బుగ్గ నరసయ్య, గడ్డమీద యాదగిరి, రామచర్ల సిద్ధులు అంగడి యాదగిరి, అంగడి శీను, సైదాపురం బాబు, క్రాంతి, ధనుష్ పిఎన్ఎం కళాబృందం పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ, సూర్యాపేట
యాదాద్రిభువనగిరి
శనివారం | మార్చి 22, 2025 | www.navatelangana.com

ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో...

ఓటరు చైతన్యంపై కళాప్రదర్శనతో అవగాహన

నమ్మకురన్నా ఓరన్న క్కులన్నలారా....
పచ్చ నోట్ల కాగితాలతో వచ్చి...
మాయమాటలతో మన ఓటు గుంజుతురు.
కల్లు, బ్రాండి తెచ్చి ఇచ్చి, ఓటును గుంజుతారు.. మోసపోయి
ఓటేసే గోస మనకు తప్పదింక......
ఓటు మీద ఓటు గుద్ది....
గదే మీద కూర్చోబెడితే ...
కట్టలే చూస్తాదు గాని, కష్టాలు చూడరారు...
దోపిడీ దొంగలతోనూ చేతులు కలిపేటోడు...
కుంభకోణాలు చేసి స్విస్ బ్యాంకులో కోట్లు దాచి ...
దేశాన్ని అమ్మ చూపు....దేశద్రోహులైనరు...
మతం, కులం పేరు చెప్పి ఓటు అడుగుతారు...
ఈ చీకటి రాజ్యం, ఇది దోపిడి రాజ్యం....
నమ్మకురన్న ఈ అవినీతి పరుల మాటలు, చేష్టలు...
అంటూ పాటలు, ఆటలు, నాటికల ద్వారా ప్రజాన్యాట్యమండలి ఆధ్వర్యంలో ఓటరు చైతన్యంపై ప్రజాచైతన్య కళాయాత్ర ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

నవతెలంగాణ-భువనగిరి

పాటలు ఆటలు నాటికలు గొల్లెసుద్దులు చెప్తూ ప్రజానాట్యమండలి యాదాద్రి భువనగిరి జిల్లాలో స్థానిక ఎన్నికలు ఓటరు చైతన్యంపై జిల్లా వ్యాప్తంగా ఈ నెల 10 నుండి ప్రజా చైతన్య కళాయాత్ర నిర్వహిస్తున్నారు. ప్రజలను చైతన్యం చేస్తూ ముందుకు సాగుతున్నారు. స్థానిక ఎన్నికలలో ప్రజా సమస్యలను గుర్తించి పోరాడే అభ్యర్థులను గెలిపిద్దాం. గ్రామ అభివృద్ధిని సాధిద్దాం. అవకాశవాదులు, స్వార్థపరులను ఓడిద్దామంటూ కాలికి గజ్జె కట్టి భుజాన గొంగడి వేసుకొని గొల్ల సుద్దులు చెప్తున్నారు. మరోవైపు మహిళలు ఈ సమాజంలో మహిళలు పడుతున్న అవస్థలను నాటిక రూపంలో ఎత్తిచూపుతున్నారు. కళ కళ కోసం కాదు..కళా ప్రజల కోసం...కళ కాసుల కోసం కాదు..కళా ప్రగతి కోసం...అంటూ ప్రజల బాధలను సమస్యలను కళారూపాలలో నిత్యం ప్రదర్శిస్తున్నారు..నాటి తెలంగాణ సాయుధ విప్లవ రైతాంగ పోరాటం నుండి నిరక్షరాస్యుల ఇళ్లల్లో అక్షర దీపమై వెలుగు నింపిన అక్షరాస్యత ఉద్యమం వరకు ప్రజానాట్యమండలి ప్రజా గొంతుకై తన యాత్రలు నిర్వహిస్తూనే ఉంది. ప్రజల్లో ఉన్న మూఢవిశ్వాసాలు సామాజిక అసమానతలు రూపుమాపుతూ నిత్యం ప్రజల గొంతుకై ముందుకు సాగుతుంది. రాబోయే స్థానిక ఎన్నికల్లో ప్రజలు నిస్వార్థంగా, నిజాయితీగా ప్రజలకు సేవ చేసే ప్రజా నాయకులు ఎన్నుకోవాలని పిలుపునిస్తున్నారు. ధన బలంతో ఓట్లను కొనుగోలు చేసి మద్యంతో గ్రామాలలో ఏరులై పారించి గెలిచి గద్దెనెక్కి మనల్ని దోచుకునే స్వార్థపరులను ఓడించాలని యాత్ర నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. కళారూపాలు ప్రదర్శించి వారిచ్చిన నామ మాత్రము డబ్బులతో తమ యాత్రకు ఖర్చులకు వాడుకుంటున్నారు. ఎలాంటి డబ్బులకు ఆశపడకుండా తమ ఇంటికి, తన కుటుంబానికి దూరమై ప్రజలను చైతన్యం చేయడానికి తమ కృషి చేస్తున్నారు వారి అంకుటిత లక్ష్యాలను మనం అభినందనలు తెలుపవలసిందే. మార్చ్ 10 నుండి 25 వరకు ప్రజా చైతన్య యాత్ర నిర్వహిస్తున్నారు.

ఆకట్టుకుంటున్న గొర్రెలు తిరగబడ్డాయి.

ఓటరు చైతన్య యాత్రలో భాగంగా ప్రజానాట్యమండలి కళాకారులు ప్రదర్శిస్తున్న గొర్రెలు తిరగబడ్డాయి అనే నాటిక ప్రజలను ఆకట్టుకుంటుంది. రైతుల వ్యవసాయం నుండి



వివరాలు తెలుపుతూ సామ్రాజ్యవాదం అమెరికా కుట్రలు కుతంత్రాలను కూడా తెలియజేస్తున్నారు. పాలకులు విదేశీ కార్పోరేట్ శక్తుల ముందు ఎలా దాసోహం అవుతున్నారో కండ్లకు కట్టినట్టు వివరిస్తున్నారు. ప్రజల కష్ట సుఖాలను తెలుసుకొని వాటిని చర్చించి ప్రజలకు మేలైన జీవితాన్ని ఇవ్వాలని అందుకోసం ఉపాధి అవకాశాలు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అసెంబ్లీకి పంపిస్తే వారు చేసే తతంగాన్ని బూతుల పురాణం మేరిట వివరిస్తున్నారు అసెంబ్లీలో సమస్యల ప్రస్తావన కంటే బూతుల పురాణమే అధికంగా ఉంటుందని నాయకుల అసభ్యకరమైన మాటలను ఎత్తిచూపుతూ మన సంస్కృతిని గుర్తు చేస్తున్నారు. గ్రామాలలో జరిగే చిన్న చిన్న వీధి తగాదాల కంటే అసెంబ్లీలో మేధావులు లేక విజ్ఞానులు అనే చెప్పుకునే ఎమ్మెల్యేలు మంత్రులు ముఖ్యమంత్రులు రాష్ట్ర అసెంబ్లీలో మాట్లాడే భాషను



బూతుల పురాణాన్ని వివరిస్తున్నారు. హాస్యంతో మొదలైన ఈ నాటికలు ప్రజల్లో ఆవేశాన్ని చైతన్యాన్ని నింపుతూ ముందుకు పోతున్నాయి. పాటలు గొల్ల సుద్దులు లో ప్రజలలో విజ్ఞానాన్నింపడానికి ప్రయత్నిస్తున్నారు. ధరల పెంపుదలను వివరిస్తున్నారు రైతుల, మహిళల, విద్యార్థుల, యువజనుల కష్టాలను కండ్లకు కట్టినట్టు చూపుతున్నారు. ఈ దేశంలో అధికారంలో ఉన్న పాలకులు మతోన్మాదాన్ని ఎలా పెంచి పోషిస్తున్నారు కార్పొరేట్ శక్తులకు ఎలా అండగా ఉంటున్నారు తన వివరాలను చెబుతున్నారు రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు దివాలా తీస్తుందో చెబుతున్నారు స్థానిక సమస్యలు ముఖ్యంగా మూసి కాలుష్యం వల్ల ప్రజలకు ఎలా అనారోగ్యాలు పొందుతున్నారో, డ్రగ్స్ గుట్కా వల్ల యువత ఎలా చెడిపోతున్నారో వివరిస్తున్నారు..

ఓటును ఆయుధంగా ఉపయోగించుకోండి.

ప్రజాస్వామ్య భారత దేశంలో ప్రజలు ఎలాంటి ప్రలోభాల గురి కాకుండా ఓటుని ఆయుధంగా చేసుకొని నీతి నిజాయితీ కల్గా నాయకుని ఎన్నుకోవాలని కోరుకుంటున్నారు. ప్రలోభాలు గురైతే ఎలాంటి సమస్యలు వస్తాయో వివరిస్తున్నారు. నేటి ఆధునిక కాలంలో ఓటరు ను ప్రలోభాల గురిచేసి గొర్రెలుగా గుండు గుత్తుగా ఓట్లు వేసుకుంటమని ఆలోచించే పాలకుల కుట్రలో కుతంత్రాలను ఎండగడుతున్నారు. ఓటుని అమ్ముకుంటే బతుకులు ఆగమైతాయని ప్రజానాట్యమండలి గలమెత్తి చెప్తుంది. ఈ కార్యక్రమం ఎన్నికల కమిషన్ ఎన్నికల సమయంలో మాత్రమే పోస్టర్లు ఇతర సౌండ్ సిస్టంతో చెప్తుంది. ఓటు విలువ ఎన్నికల కమిషన్ నిత్యం ప్రజలకు వివరించాలి కానీ ప్రభుత్వం చేయడం లేదు .ప్రజానాట్యమండలి ఓటు విలువలు , ప్రాధాన్యతను ప్రజలకు ఆటపాట నృత్యం ద్వారా వివరిస్తూనే ఉన్నారు.

జిల్లాలోని 17 మండలాలలో కళారూపాల ప్రదర్శన

యాదాద్రి భువనగిరి జిల్లాలోని 17 మండలాల్లో 62 గ్రామాలలో ఈనెల 10 నుండి 25 వరకు స్థానిక ఎన్నికలు ,ఓటర్లు చైతన్యంపై జిల్లా వ్యాప్తంగా ప్రజా చైతన్య కళాయాత్ర నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఈ నెల10న సంస్థాన్ నారాయణపురం మండలం లింగమొని గూడెంలో ఈ యాత్ర ప్రారంభమైంది. ఇప్పటికే సుమారు 35 గ్రామాల్లో ప్రదర్శన నిర్వహించారు. కళాకారుల ప్రజా చైతన్య కళాయాత్ర ప్రజాదారణ పొందింది. ఆధునిక కాలంలో ప్రజానాట్యమండలి ప్రకాశిస్తున్న కళారూపాలు పాటలు వినడానికి ఇంట్లో ఉన్న కేబుల్ టీవీని బందు చేసి, చేతిలో సెల్ఫోన్లను సైలెన్స్ లో పెట్టుకొని ఈ వీధి నాటకాలు చూస్తున్నారు. యాత్రలో పాల్గొన్న సుమారు 15 మంది కళాకారులను ఆదరించి ప్రజలు దగ్గరికి తీస్తున్నారు. వారికి భోజన సదుపాయాలు వీధి నాటకాలకు అవసరమయ్యే సౌండ్ సిస్టంను సమకూరుస్తున్నారు. ప్రజల సహకారంతో ముందుకు పోతున్నారు.



ఓటును ఆయుధంగా చేసుకోవాలి.
ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు
గంటేపాక శివకుమార్.

రాజ్యాంగపరంగా వచ్చిన ఓటు హక్కును ప్రజలు ఒక ఆయుధంగా చేసుకొని అసమర్థ పాలకులను ప్రశ్నించాలని, అవినీతిపరులని ఓడించాలి. ప్రదర్శనలో నీతి నిజాయితీ ఉన్న వాళ్ళని గెలిపించాలని కోరుతున్నాం. పాలకులు ఓటు ఎలా గుంజుకుం టున్నారో వివరిస్తున్నాం. వీటితోపాటు ప్రజల్లో ఉన్న మూఢ విశ్వాసాలు, రైతులకు, కార్మికులకు, ప్రజలకు, యువకులకు, మహిళలకు పాలకులు ఎంత మేరకు నిధులు కేటాయిస్తున్నారో తెలుపుతున్నాం. కార్పొరేట్ శక్తులకు రుణమాఫీ విషయాలను నిధుల కేటాయింపులు వివరిస్తున్నాం.

ప్రజా నాట్యమండల్ని ప్రజలు ఆదరిస్తున్నారు
పీఎన్ఎం జిల్లా కార్యదర్శి ఈర్ల ముత్యాలు.

గ్రామ గ్రామాన ప్రజానాట్యమండలి కళాకారులను వారి కళారూపాలను ప్రజలు ఆదరిస్తున్నారు.పాటలు పాడుతున్నప్పుడు లేక కళారూపాలు ప్రదర్శిస్తున్నప్పుడు ప్రజలు వీధి నాటకోత్సవానికి వచ్చి చివరి వరకు చూస్తూ ఆదరిస్తున్నారు. వారు చేసిన సహకారంతోనే ప్రధానాత్య మండలి కళారూపాలను రూపొందిస్తూ ముందుకు సాగుతుంది. ప్రజలను చైతన్యం చేయడానికి తద్వారా ఓటును అమ్ముకోకుండా నివారించడానికి కళారూపాలను ప్రదర్శిస్తూ గ్రామ గ్రామాన తిరుగుతున్నాం..

గ్రామాల్లో తాగునీటి పనుల మరమ్మతులకు ...

రూ.5 కోట్లా 10 లక్షలు విడుదల

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి



వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాలలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకుగాను, తాగునీటి బోర్లు, చేతిపంపులు, పైపులైన్లు, తాగునీటి ట్యాంకుల మరమ్మతు కు గాను జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలలో 827 తాగునీటి పనులు చేపట్టేందుకు డిఎంఎఫ్ టి నిధుల నుండి రూ.5 కోట్లా10 లక్షలను విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నిధులతో గ్రామాలలో తాగునీటి చేతిపంపులతో పాటు, బోర్లను రిపేర్ చేయించాలని, అదేవిధంగా పైపులైన్ల మరమ్మత్తు చేయించడం, సింగిల్ ఫేస్ ,త్రి ఫేస్ మోటార్ల మరమ్మతు, ఓహెచ్ఎస్ ఆర్‌లను మరమ్మతు చేయించాలని ఆదేశించారు .ఈ పనులన్నింటిని సంబంధిత ఎంపీడీవోలు పర్యవేక్షించాలన్నారు. పనులు పూర్తయిన తర్వాత ఫోటోలతో సహా బిల్లులు సమర్పించాలని ,గతంలో చేపట్టిన పనులు తిరిగి చేపట్టకూడదని, వేరే పథకాలలో చేపట్టిన పనులు డిఎంఎఫ్ టి నిధుల కింద చేపట్టకూడదని ఉత్తర్వులు జారీ చేశారు .

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

జిల్లా కేంద్రంలోని దేవరకొండ రోడ్ లో ఉన్న ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదోతరగతి పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి తనిఖీచేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి, పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్లతో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రానికి కేటాయించిన విద్యార్థులు, హాజరైన విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి తదితరులు వెంట ఉన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ గుర్రంపోడు మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు.

భగత్ సింగ్ ఆశయాలను సాధించాలి

నవతెలంగాణ-మిర్యాలగూడ

స్వాతంత్ర్య సమర యోధుడు షహీద్ భగత్ సింగ్ ఆశయాలను సాధించాలని సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డబ్బికార్ మల్లేష్,డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రవినాయక్ పిలుపునిచ్చారు.భగత్ సింగ్ 94 వ వర్ధంతి ని శుక్రవారం స్థానిక ప్రకాష్ నగర్‌లో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగత్ సింగ్ నూనుగు మీసాల వయసులో ఉరికంబాన్ని ముద్దాడారని తెలిపారు.దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన యోధుడు భగత్ సింగ్ ఆశయాలు సాధించాలన్నారు.నేటి యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా భగత్ సింగ్ కోరుకున్న సమసమాజం కోసం ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో బావండ్ల పాండు,



దేశీరాం నాయక్, సాంబ నాయక్,పతాని శ్రీను, సైదా, జగన్, తరుణ్, పవన్, గని, సైదులు, చందు, సుమాన్ పాల్గొన్నారు



ఉత్తమ అంగన్వాడీ టీచర్ గా రజిత

నవతెలంగాణ-మర్రిగూడ

అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తమ ప్రతిభ పురస్కారాలలో మండలంలోని ఎరగండ్లపల్లి-3 సెంటర్ అంగన్వాడి టీచర్ ఆర్.రజిత ఉత్తమ అంగన్వాడీ టీచర్ అవార్డును అందుకున్నారు.ఈ కార్యక్రమంలో సిడిపిఓ సక్కుబాయ్, ఐసిడిఎస్ సూపర్వైజర్ యశోద పాల్గొన్నారు.

24న పార్లమెంట్ ఎదుట ధర్నాను జయప్రదం చేయండి



నవతెలంగాణ-చౌటుప్పల్

ఈ నెల 24న రవాణా రంగాన్ని రక్షించుకుందాం..కార్మిక హక్కులను కాపాడుకుందాం అనే నినాదంతో పార్లమెంట్ ముందు జరుగు ధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రయివేట్ రోడ్డు ట్రాన్స్ పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎమ్‌డి..పాషా పిలుపునిచ్చారు. శుక్రవారం మున్సిపల్ కేంద్రంలో ధర్నాను జయప్రదం చేయాలని కార్మికులతో కలిసి ఆయన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు పగలనక రాత్రనక, ఎండా వానా చలి కాలాల్లో కూడా 24 గంటలు రోడ్లపై వాహనాల నడిపేది డ్రైవర్లు అన్నారు. చట్టబద్ధమైన సౌకర్యాలు, సామాజిక క్షేమ చట్టం లేవన్నారు. సంఘ విద్రోహ శక్తుల దాడులు ఇటీవల కాలంలో డ్రైవర్లపై విపరీతంగా పెరిగాయన్నారు. రోడ్డు విస్తరణలో ఆటో కార్మికులకు అడ్డాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ట్రాన్స్ పోర్టు కార్మికులు, ఆటో రంగం వారు ప్యాసింజర్ గిరాకీ లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో ప్రభుత్వం ఫ్రీ బస్సు పెట్టడం వల్ల వాహనాల కిస్తీలు చెల్లించలేక అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం ఆటో రంగం కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటుచేయాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా కమిటీ సభ్యులు ఆదిమూలం నందీశ్వర్, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ఉపాధ్యక్షులు జి.శ్రీనివాస్‌చారి, కార్మికులు మేడి స్వామి, బండ జంగయ్య, లింగయ్య, నందగిరి శ్రీనివాస్, సుర్వి యాదగిరి, నర్సింహాగౌడ్, జంగయ్య, మల్లేశ్, విజయ్, శ్రీను, దుర్గయ్య పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలను యువత సద్వినియోగం చేసుకోవాలి

- క్రితిక హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ మోగుదాల నరసింహ గౌడ్

నవతెలంగాణ-మునుగోడు



గ్రామీణ ప్రాంతాల్లోని యువత లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించాలనే గొప్ప లక్ష్యంతో హైదరాబాదులోని దిల్ సుఖ్ నగర్ లోని క్రితిక హాస్పిటల్ సౌజన్యంతో శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని కొంపెల్లి గ్రామంలో ఏప్రిల్ 3 నుండి 5 వరకు నిర్వహించే మునుగోడు నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలను యువత సద్వినియోగం చేసుకోవాలని హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ మోగుదాల నరసింహ గౌడ్ కోరారు . శుక్రవారం ఆయన నవతెలంగాణ తో మాట్లాడుతూ క్రీడలలో యువత ఉత్తమ ప్రతిభను కనబరిచినప్పుడు కన్న తల్లిదండ్రులతోపాటు గ్రామానికి మంచి గుర్తింపు లభిస్తుందని అన్నారు. క్రీడలలో పాల్గొనాలనుకునే క్రీడాకారులు 750 ఎంట్రీ ఫీజు చెల్లించేందుకు ఆర్గనైజింగ్ కమిటీని సంప్రదించాలని సూచించారు . గెలుపొందిన క్రీడాకారులకు ప్రథమ బహుమతి 20 వేలు, ద్వితీయ బహుమతి 10 వేలు అందించనున్నట్లు తెలిపారు . క్రీడలలో ఎంపైర్ నిర్ణయం తుది నిర్ణయం, ఎంపైర్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తే ఆ టీమును క్రాస్ చేపడుతుందని తెలిపారు. ఈ గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సాగర్‌లో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-నాగార్జునసాగర్

ప్రపంచ ప్రసిద్ధిగాంచిన అంతర్జాతీయ పర్యాటక కేంద్రం నాగార్జునసాగర్‌లో ఫైర్ స్టేషన్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఎంతో పేరు ప్రఖ్యాతలు ఉన్నటువంటి నందికొండ మున్సిపాలిటీ పరిధిలో నాగార్జునసాగర్ ప్రాజెక్ట్, ప్రధాన జల విద్యుత్ కేంద్రం, పర్యాటకులకు ఆతిథ్యం ఇచ్చే గెస్ట్ హౌసులు ఉన్న నాగార్జునసాగర్‌లో ఫైర్ స్టేషన్ లేకపోవడం కారణంగా తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఎండాకాలం వస్తే ఎక్కడ అగ్గిరాజుకుంటుందో, ఏ ప్రాంతం అగ్నికి ఆహుతి అయిపోతుందో అర్థం కాని పరిస్థితి సాగర్లో ఉంటుంది. నల్లమల అటవీ ప్రాంతమైన నాగార్జునసాగర్ అటవీ డివిజన్ పరిధిలో అటవీ ప్రాంతంలో కూడా తరచుగా మంటలు చెలరేగి అగ్ని ప్రమాదాలు జరిగి వందల ఎకరాల మేరకు అగ్నికి ఆహుతి అయిన సంఘటన కూడా ఉన్నాయి. నాగార్జునసాగర్ లో విద్యుత్తు ఉత్పత్తి అయిన తర్వాత పవర్ గ్రిడ్ కు ఉత్పత్తి అయిన కరెంటు చేరుకొని అక్కడినుండి సబ్ స్టేషన్లకు ఇతర ప్రాంతాలకు హై టెన్షన్ వైర్ల ద్వారా విద్యుత్ సరఫరా అవుతూ ఉంటుంది. నాగార్జునసాగర్ లో ఎత్తైన వృక్షాలు ఉన్న కారణంగా గాలులకు విద్యుత్ సరఫరా అయ్యే వైర్లు తగులుకొని అగ్గి రవ్వలు కింద పడుతూ ఉంటాయి. ఈ సందర్భంలో అనుకోకుండా మంటలు చెలరేగి తీవ్ర నష్టాన్ని చవిచూడాల్సి వస్తుంది. ఎంతో ప్రాముఖ్యత కలిగిన నాగార్జునసాగర్ లో ఏదైనా పెద్ద అగ్నిప్రమాదం సంభవిస్తే దానిని అరికట్టడానికి 20కి. మీ పైగా దూరంలో ఉన్న హాలియా నుండి ఫైర్ ఇంజన్లు రావాల్సి ఉంటుంది. ఎండాకాలం సమర్పించగానే నాగార్జునసాగర్ పరిధిలో అగ్ని ప్రమాదాలు తరచుగా సంభవిస్తూ ఉంటాయి.. రెండు నెలల గడువు కాలంలో అటవీ ప్రాంతంలో మూడుసార్లు విజయ విహార్ పర్యాటక గెస్ట్ హౌస్ లో ఒకసారి, రెండు రోజుల క్రితమే నాగార్జునసాగర్ ప్రధాన డ్యాం సమీపంలో అగ్ని ప్రమాదం సంభవించిన సంఘటనలు ఉన్నాయి. 20 వేల జనాభా ఉన్న నాగార్జునసాగర్ లో ఫైర్ స్టేషన్ ను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



రైతాంగ సమస్యలపై దృష్టి పెట్టాలి

- రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి

నవతెలంగాణ-రామన్నపేట

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేసి రైతాంగ సమస్యలు పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేకా అశోక్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని సిరిపురం గ్రామంలో రైతు సంఘం సభ్యత నమోదు కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంవత్సరం క్రితం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అనేక హామీలు ఇచ్చిందని రైతాంగ హామీల నెరవేర్చడంలో చొరవ చూపాలని అన్నారు. 42 లక్షల మంది రైతులకు 31వేల కోట్లకు గాను కేవలం 25 లక్షల మంది రైతులకు 21వేల కోట్లు చెలించగా ఇంకా 17 లక్షల మంది రైతులకు 10 వేల కోట్లు ఋణమాఫీ కాలేదని అన్నారు. రైతులు అప్పులు తెచ్చి వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతు బీమా 59 సంవత్సరాల నుండి 65 సంవత్సరాలకు పెంచాలని ఆయన కోరారు. ఎండిన పంట వివరాలను నమోదు చేసి నష్టపోయిన రైతులకు ఎకరానికి 30 వేల రూపాయల పరిహారం అందివ్వాలన్నారు. ధర్మారెడ్డి పల్లి, పిలాయిపల్లి కాల్వలకు నీరందక భూగర్భ జలాలు అడిగింటాయని దీని మూలంగానే పంటలు ఎండిపోయాయని వెంటనే ఈ రెండు కాలువలను పూర్తి చేసి చెరువులు, కుంటలు నింపాలని, లేనిపక్షంలో రైతులతో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు బల్గూరి అంజయ్య, శాఖ కార్యదర్శి అంబటి మల్లారెడ్డి, మాజీ ఎంపిటిసి బడుగు రమేష్, రాపోలు ప్రభాకర్, బలుగూరి ఉపేందర్, మాజీ చైర్మన్లు దోమలపల్లి నర్సింహా, సిల్వరు సత్తయ్య, దాడి మల్లారెడ్డి, ఏళ్ల రుక్మారెడ్డి, దాడి సుభాష్ రెడ్డి, మోటే మల్లేశం, బల్గురి నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలి

● జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి కె.వి.కృష్ణవేణి



నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి కె.వి.కృష్ణవేణి అన్నారు. శుక్రవారం స్థానిక టీఎన్జీవో భవన్ స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మహిళా దినోత్సవ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. మహిళలు కష్టపడి పని చేస్తే అన్ని రంగాలలో రాణించవచ్చని, అందుకు ప్రభుత్వం ఎన్నో విధాలుగా కృషి చేస్తుందని అన్నారు. ప్రతి ఇంట్లో మహిళ చదువుకుంటే ఆ ఇల్లు విద్యాలయంగా పెంపొందుతుందని అన్నారు. నాటి నుంచి నేటి వరకు మహిళ చేస్తున్న కృషి ఎనలేనిగాని అన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను, అధికారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారి చరిత, ఉద్యాన శాఖ అధికారి శ్వేత, ఏపీ డి నారద, జి సి డి ఓ సరిత, ప్రాజెక్టుల సిడిపిఓలు, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు ఆయాలు పాల్గొన్నారు.

తప్పుడు పోస్టులు పెట్టే వారిపై ప్రత్యేక నిఘా

● ఎస్పీ శరత్ చంద్ర పవార్



నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

రానున్న ఉగాది,రంజాన్ పండుగ సందర్భంగా కుల,మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెట్టే వారిపై నిరంతరం సోషల్ మీడియా మానిటరింగ్ సెల్ ద్వారా పర్యవేక్షిస్తూన్నామని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైన సామాజిక మాధ్యమాల్లో వాట్స్ అప్,ఫేస్బుక్, ట్విట్టర్, ఇన్స్టాగ్రాం, యూ ట్యూబ్, మొదలగు వాటిని వేదికగా చేసుకుని ఇతర కులాల పట్ల ,మతాల పట్ల,వ్యక్తుల పట్ల అనుచిత వ్యాఖ్యలు, విద్వేష పూరితమైన పోస్ట్ లు,ద్వేష పూరిత ప్రసంగాలు, రెచ్చ గొట్టే విధంగా పోస్ట్ లు,అసత్య ప్రచారాలు చేస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించే రీతిలో తప్పుడు పోస్టులు పెడితే తగిన చర్యలు తప్పవు అని హెచ్చరించారు.సోషల్ మీడియాలో వచ్చే పుకార్లు, ప్రజలు ఎవ్వరు నమ్మవద్దని సూచించారు. సామాజిక మాధ్యమా లను వేదికగా చేసుకోని తప్పుడు, విద్వేషకర పోస్టులు చేసిన, షేర్ చేసినా వారి సమాచారాన్ని సంబంధిత పోలీస్ స్టేషన్ కి తెలియజేయాలన్నారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.



బెల్టు జోరు!

- కోదాడ నియోజకవర్గంలో సిండికేట్ అక్రమ దందా
- అధిక ధరలకు మద్యం అమ్మకాలు, సిండికేట్ దందానే అసలు కారణం
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్ శాఖ, ప్రతిఒక్కరికీ నెలవారీ మామూళ్లు
- సిండికేట్కు మద్దతుగా మండలాలోని అధికార, ప్రతిపక్ష పార్టీ నాయకులు
- వార్తలు రాసినా, ప్రశ్నించినా కేసులు పెడతామంటూ బెదిరింపులు
- సిండికేట్పై ఎమ్మెల్యే హామీ నిలబెట్టుకోవాలి

ఛిద్రమౌతున్న బతుకులు

నవ తెలంగాణ-కోదాడ టౌన్

గత బీఆర్ఎస్ ప్రభుత్వం కోదాడలో ఓటమి కావడానికి ప్రధానమైన కారణాలలో ఒకటి సిండికేట్. ఇది ఎవరు అవునన్నా కాదన్నా నిజం. గత ఎమ్మెల్యేపై కాంగ్రెస్ పార్టీ నాయకులు చేసినటువంటి ప్రధానమైన ఆరోపణ ఇది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రతి గ్రామంలో ప్రచారంలో కూడా ఇదే సిండికేట్ అస్త్రాన్ని వాడింది. అది చాలా గ్రామాలలో ప్రభావితం చూపి కాంగ్రెస్ గెలుపునకు నేటి ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి విజయానికి కారణం అయింది. తాము అధికారంలో ఉన్నంతవరకు సిండికేట్ వ్యవస్థను ఎట్టి పరిస్థితుల్లో దరిచేరనీయమని ప్రస్తుతం ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి సైతం పలుమార్లు సభలలో మాట ఇచ్చిన సందర్భం ఉంది. ఎమ్మెల్యే సిండికేట్ వ్యవస్థను నిర్మూలించాలని లక్ష్యంతో ఉన్నప్పటికీ నియోజకవర్గ వ్యాప్తంగా కోదాడ రూరల్, చిలుకూరు, మునగాల, అనంతగిరి, నడిగూడెం, మోతె మండలాలలో అధికార ప్రతిపక్ష పార్టీ నాయకులు, వైన్స్ షాపుల వారికి సహకరిస్తూ సిండికేట్ వ్యవస్థకు పురుడు పోశారు. గ్రామాలలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు ఏర్పడడానికి గృహత పడుతున్నారు. వేడినీళ్లకు చలి నీళ్లు తోడునట్లు అధికారులు కూడా నిమ్మకు నీరు ఎత్తినట్టుగా ఉంటున్నారు. అధికారుల నిర్లక్ష్యం.. పాలకుల పరిహాసం.. ఫలితంగా మందుబాబుల జేబులు గుల్ల వుతున్నాయి. మద్యం అమ్మకాల్లో నిబం ధనలకు నీళ్లొదిలి.. సిండికేట్ దందాకు అక్రమార్కులు తెరలేపారు. అడ్డుకోవాల్సిన అధికారులు.. అందినకాడికి దండుకుని సైలెంట్ అయిపోతున్నారు. దీంతో మద్యం అమ్మకాల్లో సిండికేట్ వ్యాపారులు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారిపోయింది. ఈజీ మనీ కోసం గ్రామీణ ప్రాంతాల్లోనూ బెల్ట్ దుకాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నా యని ప్రజలు ఆరోపిస్తున్నారు. వీటిపై అధికా రుల నియంత్రణ లేకపోవడంతో సిండికేట్ దందా మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతున్నది. కోదాడ నియోజకవర్గంలో ప్రతిరోజు లక్షలలో దందా జరుగు తోందంటే అతిశయోక్తి కాదు.

ఒక్కో బాటిల్పై రూ.30-50 వరకు అధికం

కోదాడ నియోజకవర్గంలోని ఆరు మండలాలలో సిండికేట్ దందా పుణ్యమంటూ మద్యం ధరలు ఆకాశన్నంటు తున్నాయి. అదేంటి మద్యం బాటిళ్ల ధరను ముందుగానే నిర్ణయిస్తే.. ధరలు ఆకాశన్నం టడం ఏమిటి అనుకుంటున్నారా.. మరేం లేదండీ.. ఏ మండలానికి ఆ మండలంలోని మద్యం వ్యాపారులు సిండికేట్గా ఏర్పడి.. కొత్తదందాకు తెరలేపారు. ఆయా మండలాల పరిధిలోని మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయిస్తుండగా, బెల్టు కాణాల్లో మాత్రం ఒక్కో బాటిల్పై రూ.30 నుంచి రూ.50 వరకు అధిక ధర వసూలు చే స్తున్నారు. వ్యాపారులు సిండికేట్గా ఏర్పడి.. మండల పరిధిలోని ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసే బెల్ట్ దుకాణాలకు ఆటోలా సరఫరా చేసి మద్యాని కి ప్రత్యేకంగా స్టిక్కర్ వేస్తారు. ఈ స్టిక్కర్ లేని మద్యం బాటిళ్లను బెల్ట్ దుకాణాల్లో అమ్మడం నిషిద్ధం. అలా ఎవరైనా అమ్మితే సిండికేట్ నిర్వాహకులు వాళ్ళు ఏర్పాటు చేసుకున్న ప్రవేట్ సైన్యంతో గ్రామీణ ప్రాంతాలలో ఇండ్లపై తనిఖీల పేరిట దాడులు చేస్తారు. స్టిక్కర్లేని సీసాలు ఉంటే వెంటనే వాటిని తీసుకొని పోతారు. ఒకవేళ షాపు నిర్వాహకులు ఎదురు తిరిగితే ఎక్సేంజ్ అధికారులలో అనుకూలంగా ఉన్న వారితో ఎదురు తిరిగిన బెల్ట్ షాప్ వారి పై తనిఖీలు చేయించి పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తారు.. దీంతో బెల్ట్ దుకాణదారులు సిండికేట్ నుంచే మద్యం బాటిళ్లను ఎమ్మార్పీ కంటేరూ.10 నుంచి రూ.20 అదనంగా ఇచ్చి తీసుకెళ్తుంటారు. ఈ డబ్బును బెల్ట్ దుకాణాల్లో మద్యం సేవించేందుకు వచ్చిన మందుబాబుల నుంచి ఒక్కో బాటిల్ పై రూ.30 నుంచి రూ.50వరకు అదనంగా వసూలు చేస్తుంటారు.

ఇచ్చిన బ్రాండ్ తాగాల్సిందే..

మద్యం దుకాణాల్లో నచ్చిన బ్రాండ్ కొనుగోలు చేసి తాగే పరిస్థితి మద్యం ప్రియులకు లేకుండా పోయింది. నిజానికి మద్యం దుకాణాల్లో ప్రతి బ్రాండ్ మద్యం దొరకాల్సి ఉంటుంది. కానీ పలు బ్రాండెడ్ కంపెనీలు మార్జిన్ (కమీషన్) తక్కువగా ఇస్తుంటాయి. కొన్ని బ్రాండ్లపై మాత్రమే మార్జిన్ అధికంగా ఉంటుంది. దీంతో మద్యం దుకాణాల యాజమాన్యాలు మార్జిన్ అధికంగా ఇచ్చే కంపెనీలకు చెందిన మద్యం బాటిళ్లను మాత్రమే విక్రయించేందుకు మొగ్గు చూపుతున్నారు. మద్యం దుకాణాల్లో దొరకని మంచి బ్రాండ్ల మద్యం.. బెల్ట్ దుకాణాల్లో మాత్రం దర్శనమిస్తుంది. కాకపోతే ఇక్కడ ఒక్కో బాటిలు అదనంగా డబ్బు సమర్పించుకోవాల్సిందే. మద్యం దుకాణాల్లో దొరకని మద్యం.. బెల్ట్ దుకాణాల్లో దొరకడం వెనుక సిండికేట్ దందా చక్రం తిప్పుతుండడం గమనార్హం. మద్యం దుకాణాల్లో మంచి బ్రాండ్ల మద్యం ఉన్నా.. స్టాక్ లేదంటూ మందుబాబులకు ఇవ్వకుండా ఇతర బ్రాండ్ల మద్యాన్ని అంటగట్టే ప్రయత్నం చేస్తుంటారు.

ఎక్సైజ్ అధికారులకు పట్టదా..?

కోదాడ నియోజకవర్గ వ్యాప్తంగా అక్రమంగా మద్యం విక్రయాలు పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయి. కిరాణా షాపుల పేరుతో అక్రమ మద్యంను విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. అయినా ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు ఎందుకని ప్రజలు మండిపడుతున్నారు. ఒక వేళ ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తులో ఈ అక్రమ క్రయవిక్రయాలను ప్రోత్సహిస్తున్నారా అనే సందేహాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి ఇలాంటి అక్రమ మద్యం విక్రయాలను అడ్డుకోవాలని స్థానికులు వేడుకుంటున్నారు.

ప్రజల అవస్థలు..



అక్రమంగా మద్యం విక్రయాలు సాగుతుండటంతో నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాలలో తాగుబోతులకు అడ్డూ అదుపు లేకుండా పోతుంది. సామాన్య ప్రజల ముందే మద్యాన్ని విక్రయిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తాగుబోతులు తాగి రోడ్లపై ఎక్కడబడితే అక్కడ వీరంగం సృష్టిస్తున్నారు. దీంతో స్థానికంగా అనేక ప్రమాదాలు, దాడులు జరిగిన సంఘటనలు చాలానే ఉన్నాయని స్థానికులు తెలుపుతున్నారు. ఎక్సైజ్ అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి మద్యం విక్రయాలను నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మద్యంతో మా కుటుంబాలు నాశనమవుతున్నాయని, సిండికేట్ వ్యవస్థను నిర్మూలించాలని మహిళలు గలంమెత్తుతూ మండలంలోని నాయకులకి అధికారులకు మొరపెట్టుకున్న ఫలితం లేకపోవడంతో, నేరుగా ఎమ్మెల్యేకు మొరపెట్టుకుంటున్నారు. పద్మమ్మ మా భర్తల ప్రాణాలతోపాటు మా కుటుంబాలని కాపాడమ్మా అంటూ... మా కుటుంబాలకు భరోసా ఇవ్వమ్మా అంటూ ప్రాధేయ పడుతున్నారు.

ఎర్రజెండాతోనే ప్రజాసమస్యల పరిష్కారం

● సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండీ.జహంగీర్



నవతెలంగాణ-భువనగిరి

అనాజీపురం గ్రామంలో సీపీఐ(ఎం) పాలనలో గ్రామం అన్ని రంగాలలో అభివృద్ధి చెందిందని ఎర్రజెండాతోనే ప్రజాసమస్యలు పరిష్కారం అవుతాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి. జహంగీర్ అన్నారు. బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు. ప్రజానాట్యమండలి యాదాద్రి భువనగిరి జిల్లా కమిటి ఆధ్వర్యంలో చేపట్టిన 'ఓటర్ చేతన్యం - ప్రజా చైతన్య యాత్ర' సందర్భంగా అనాజిపురం గ్రామంలో గురువారం రాత్రి సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు గునుగుంట్ల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సభలో జహంగీర్ మాట్లాడారు. ఈ మధ్యకాలంలో ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పోరేట్ శక్తులకు అర్హులంగా పేదలకు మధ్యతరగతి ప్రజలకు భారంగా ఉన్నదని అన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంతో పాటు ప్రభుత్వ రంగాలను కూడా నిర్వీర్యం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా తమ ఎన్నికల హామీలను అమలు చేసే విధంగా తమ బడ్జెట్ లేదని ఈ పరిస్థితిలో యాదాద్రి భువనగిరి జిల్లా సంక్షేమానికి, ప్రాజెక్టుల పూర్తికి ఒక్క పైసా కూడా కేటాయించలేదని అన్నారు. రానున్న కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు, దాసరి పాండు, సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, దయ్యాల నర్సింహ, పార్టీ మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, మాజీ కార్యదర్శి బొల్లెపల్లి కుమార్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గంటపాక శివ, ఈర్లపల్లి ముత్యాలు, ప్రజా సంఘాల జిల్లా నాయకులు వనం రాజు, చింతల శివ, వడ్డబోయిన వెంకటేష్, రాహుల్ సిపిఎం మండల కమిటీ సభ్యులు అబ్దుల్లాపురం వెంకటేష్ , శాఖ కార్యదర్శిలు ఏదునూరి వెంకటేష్ , కడారి కృష్ణ నాయకులు ముచ్చపతి బాలయ్య , బొల్లెపల్లి స్వామి, కిషన్, నవీన్, బిక్షపతి, ప్రవీణ్, గణేష్,బాను, బాలరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గొర్రెలు తిరగబడతాయ్, బూతులాపురం అనే కళారూపాలు ప్రదర్శించారు.

పోచంపల్లిని సందర్శించిన విద్యార్థులు

నవతెలంగాణ-భూదాన్పోచంపల్లి

జెడి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ హైదరాబాద్ 120 మంది విద్యార్థులు పోచంపల్లి క్షేత్ర పర్యటనలో భాగంగా శుక్రవారం సందర్శించారు కళా పునర్వి చేనేత కార్మికుల గృహాలను టూరిజం పార్క్ పరిశీలించి చేనేత కార్మికుల చేనేత వస్త్రాలు తయారు విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యమంలో రాత్నం రంగుల అద్దకాలు వార్పు టూరిజం పార్కు సుదర్శన్.హెచ్వోడి దిశా, అధ్యాపకులు ప్రియా సిమన్, శ్వేత ఉన్నారు.

సమస్యలపై డీవైఎఫ్ఐ వినతి

నవతెలంగాణ-సంస్థాన్నారాయణపురం



పుట్టపాక గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డీవైఎఫ్ఐ గ్రామ శాఖ నాయకులు యాదాద్రి భువనగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు దొంతగోని అమరేందర్ మాట్లాడుతూ గ్రామ పరిధిలోని బట్టోని బాయి,సాయిగోని బాయి గ్రామాల్లో రేషన్ షాపు, పింఛన్ పంపిణీ కేంద్రం లేకపోవడంతో వృద్ధులు,వికలాంగులు పెన్షన్,రేషన్ బియ్యం తీసుకోవడానికి సుమారు ఒక కిలోమీటర్ నడవలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.ఆయా గ్రామాల్లోనే పెన్షన్,రేషన్ బియ్యం అందజేయాలని కోరారు. గ్రామంలోని నిరుపేదలకు ప్రభుత్వం 2009-2010ల్లో పంచిన ప్లాట్లును కబ్జా చేసిన వారిపై చర్య తీసుకోవాలన్నారు.ప్లాట్ల హద్దురాలను తొలగించి పత్తి పంట సాగు చేసి ప్లాట్ యజమానులను బెదిరిస్తున్న వారిపై చర్య తీసుకోవాలన్నారు. ఇళ్ల స్థలాలకు చెందిన3.20 ఎకరాల భూమిని గ్రామానికి చెందిన కొంతమంది కబ్జా చేసినట్లు పేర్కొన్నారు. కబ్జా కోర్ల నుండి ఇండ్ల స్థలాల భూమిని రక్షించి అర్హులైన వారికి అందజేయాలనీ కోరారు.వినతి పత్రం ఇచ్చిన వారిలో డివైఎఫ్ఐ గ్రామ కార్యదర్శి జోకు మహేష్,నడికుడి నరసింహ,నల్లవెల్లి వెంకటేష్,ఆందోజు శంకరచారి,సుక్క మహేష్ తదితరులు ఉన్నారు.

28న సీపీఐ(ఎం) జన చైతన్య పాదయాత్ర

నవతెలంగాణ-ఆలేరుటౌన్



ఆలేరు మండల కేంద్రంలో పేరుకుపోయిన ప్రజాసమస్యల పరిష్కారం కొరకు, ఈ నెల 28న సీపీఐ(ఎం) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జన చైతన్య పాదయాత్ర చేపడుతుందని, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కల్లూరు మల్లేశం అన్నారు. ఆలేరు మండల కేంద్రంలో శుక్రవారం సీపీఐ(ఎం) పట్టణ జనరల్ బాడీ సమావేశము ఆర్యవైశ్య భవనంలో వడ్డేమాన్ బాలరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కల్లూరి మల్లేశం మాట్లాడుతూ పట్టణంలోని ప్రజా సమస్యలు పరిష్కరించాలన్నారు. పట్టణంలో వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం ,ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు, గంధ మల్ల రిజర్వాయర్ నిర్మాణము, ఆలేరు పెద్దవాగు బ్రిడ్జి వెడల్పు చేయడం, పెద్దమ్మ గుడి నుండి ఈదమ్మ గుడి వరకు వరద కాలువ నిర్మాణం ఈదుల వాగు రత్నాల వాగులపై హై లెవెల్ బ్రిడ్జిల నిర్మాణం పనులు ప్రభుత్వం వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రతి ఇంటిని కలిసి వారి సమస్యలను తెలుసుకోవడం అనంతరం 29న మున్సిపల్ ఆఫీసు ముందు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియా రాజు ,సిపిఎం పట్టణ కార్యదర్శి ఎంఏ ఇక్బాల్ ,మోరిగాడి రమేష్, మోరిగాడి చంద్రశేఖర్, ఘనగాని మల్లేష్ ,బొప్పిడి యాదగిరి, మోరిగాడి అశోక్, చెన్న రాజేష్ ,అంజయ్య చెక్క పరశురాములు, మురిగాడి లక్ష్మణ్ ,ఘనగాని రాజు ,వడ్డెమాను విప్లవ్ ,కటకం సుదర్శన్, మోరిగాడి స్వరూప ,ఐలి చంద్రకళ, మైలారం కళ్యాణి ,రచ్చ వజ్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం స్థలాన్ని కాపాడాలి

● సీపీఐ(ఎం) మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్



నవతెలంగాణ-చౌటుప్పల్

చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో అన్యాక్రాంతమవుతున్న ఇండోర్ స్టేడియం ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని, స్టేడియం నిర్మాణ పనులను పూర్తిచేయాలని సీపీఐ(ఎం) మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్ డిమాండ్చేశారు. ఆ పార్టీ పోరుబాటలో భాగంగా శుక్రవారం మున్సిపల్ కేంద్రంలోని 13వ వార్డులోని సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండోర్ స్టేడియం నిర్మాణం పూర్తిచేయడానికి ఎందుకు కాలయాపన జరుగుతుందని ప్రశ్నించారు. స్టేడియం భూమి కబ్జాలకు గురికాకుండా మున్సిపల్ అధికారులు స్పందించి, ప్రభుత్వ స్థలాన్ని రక్షించాలని కోరారు. అసంపూర్తిగా ఉన్న స్టేడియం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందన్నారు. కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో సౌకర్యాలు లేక విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎమ్.డి.పాషా, నాయకులు బొడ్డు అంజిరెడ్డి, తొర్పునూరి మల్లేశ్, బత్తుల రమేశ్, భావండ్లపల్లి స్వామి, నర్సింహా, మల్లేశ్ పాల్గొన్నారు.

విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ-చౌటుప్పల్



రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తుందని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు దాసరి ప్రకాశ్, తీగుళ్ల శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కేంద్రంలోని 65వ నెంబర్ జాతీయ రహదారిపై ఆ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బడ్జెట్లో విద్యారంగానికి ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి తక్కువ నిధులు కేటాయించారని తెలిపారు. 23,108 కోట్ల రూపాయలు రాష్ట్రంలోని విద్యారంగానికి సరిపోవన్నారు. స్కాలర్షిప్పులు, ఫీజు రీయింబర్స్ మెంట్కు సంబంధించి ఎనిమిది వేల కోట్ల రూపాయలు పెండింగ్లో ఉన్నాయన్నారు. కేవలం 7.57శాతం మాత్రమే నిధులు కేటాయించారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లు, గురుకులాలు, యూనివర్శిటీలు అభివృద్ధి కావాలంటే 30 శాతం నిధులు అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల ఉపాధ్యక్షులు దోనూరి శ్రావణ్రెడ్డి, నాయకులు సాగర్, అజయ్, మల్లేశ్, సాయిచంద్, వరుణ్ పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్

కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను శుక్రవారం చౌటుప్పల్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శివకోటి హరికృష్ణ అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చౌటుప్పల్ మండల పట్టణ వివాహితులకు అందజేశారు. 71 మందికి రూ. 71,08,236 చెక్కులను ప్రభుత్వం అందజేసిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎన్నికల ఇన్చార్జి పబ్బు రాజుగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ఉబ్బు వెంకటయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షులు బోయ దేవేందర్ పట్టణ అధ్యక్షులు సుర్వి నరసింహ గౌడ్ మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

సమస్యలపై ఐద్వా సర్వే



నవతెలంగాణ-క్లాక్టవర్

నల్గొండ పట్టణం ఎస్ఎల్బిసిలో సమస్యలపై శుక్రవారం ఐద్వా ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం పట్టణ కార్యదర్శి భూతం అరుణకుమారి మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రం నిర్వహించాలని, రేషన్షాపు ఏర్పాటు చేయాలని, కాలనీలో భగీరథ మంచినీళ్లు ఇవ్వాలని, డ్రైనేజీలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పర్వీన్, సైదాబీ, సన, ఫరీదా తదితరులు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీ నరసింహస్వామి నిత్య కల్యాణం

నవతెలంగాణ-మఠంపల్లి

శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో శుక్రవారం శ్రీస్వామి వారికి నిత్య కల్యాణం దేవాలయ అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, పద్మనాభా చార్యులు, లక్ష్మీనరసింహ మూర్తి వార్లచే శాస్త్రోతముగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో దేవస్థానం అనువంశిక ధర్మకర్త చెన్నూరు విజయకుమార్ పాల్గొన్నారు.

బోరు మోటార్ మంజూరు చేసిన ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు



నవతెలంగాణ-చండూరు

మండలంలోని పుల్లెంల గ్రామంలో ఎస్సీ కాలనీలో నీటి సమస్యను ఉందని స్థానిక మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లిన కాంగ్రెస్ నాయకులు వెంటనే స్పందించిన ఎమ్మెల్యే తన నిధుల నుంచి సింగిల్ ఫేజ్ బోరు మోటర్ ని మంజూరు చేశారు. శుక్రవారం ఎస్సీ కాలనీలో బోరు మోటర్ ని బిగించి నీటి సమస్య పరిష్కారం చూపిన ఎమ్మెల్యే కి గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు వడ్డగోని చంద్రశేఖర్ గౌడ్,కాంగ్రెస్ నాయకులు మండడి శంకర్ రెడ్డి,ఉపాధ్యక్షులు పాలకూరి భిక్షమయ్య,మాజీ ఎంపీటీసీ సీత యాదయ్య, ఇరిగి బుచ్చయ్య, వెంకన్న, పోలె రవి, పెసర్ల యాదయ్య, సిద్ధూ, సుఖేందర్, ఇరిగి సైదులు, పోలె సాయిలు, చెడుబుద్ది సాయిలు, సీత రాజీవ్ పంచాయతీ కార్యదర్శి ప్రభువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సమస్యలను పరిష్కరించాలి

నవతెలంగాణ-కట్టంగూర్

మండలంలోని ఇస్మాయిల్పల్లి గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని గ్రామ మాజీ ఉపసర్పంచ్ జాల ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కారం కొరకు పోరుబాట కార్యక్రమంలో భాగంగా గ్రామంలో తిరిగి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి కి వినతిపత్రం సమర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో మురుగు కాలువలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పలు వార్డులలో కృష్ణా జలాలు సరఫరా కావడం లేదని, మురికి కాలువలో చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతున్నాయని పేర్కొన్నారు గ్రామ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు మాద సైదులు నాయకులు చిలుకూరు సైదులు, శాఖ కార్యదర్శి పెంజర్ల కృష్ణ, రామ్ రెడ్డి, అర్జున్, నర్సింహ్మా, కిరణ్, ఎల్లేష్, లింగయ్య ఉన్నారు.

సీఐటీయూ నాయకుల ముందస్తు అరెస్టు



నవతెలంగాణ-నార్కట్పల్లి

అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం తలపెట్టిన హైదరాబాదులో మహాధర్నాకు వెళ్లకుండా నాయకులను అరెస్టుం చేయడం సరికాదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు చింతపల్లి బయన్న , ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కుమ్మరి శంకర్ అన్నారు. ఈ మహా ధర్నాకు వెళ్లకుండా సీఐటీయూ నాయకులను అరెస్టులు చేసి పోలీసు స్టేషన్కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నాంపల్లి : అక్రమ అరెస్టులతో ఉద్యమాలని ఆపలేరని సీఐటీయూ నాంపల్లి మండల గౌరవ అధ్యక్షులు నాంపల్లి చంద్రమౌళి అన్నారు.సీఐటీయూ నాయకులను పోలీసులు తెల్లవారుజామునే ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లనివ్వకుండా అరెస్టు చేయడం సరికాదన్నారు.

కేతపల్లి : అక్రమ అరెస్టుల తో కార్మిక ఉద్యమాలను నిలవరించలేరని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ఆదిమల్ల సుధీర్ అన్నారు. శుక్రవారం చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లకుండా ముందస్తుగా కేతపల్లి పోలీస్ లు అరెస్ట్ చేశారు. సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్ర లో హమాలీ,ట్రాన్స్ పోర్ట్,భవన నిర్మాణ కార్మికుల ఛలో హైదరాబాద్ (ఇందిరా పార్క్)కు కార్మికులు కార్మిక నాయకులు వెళ్లకుండా ప్రభుత్వం పోలీసు ల తో ముందస్తు గా అరెస్టులు చేసి పోలీసుస్టేషన్ లో నిర్బంధించినంత మాత్రాన కార్మికులు బయపడరన్నారు.

నకిరేకల్ : నకిరేకల్ పట్టణంలో సిఐటియు నాయకులను పోలీసులు తెల్లవారుజామునే ముందస్తు అరెస్టు చేయడం సబబు కాదని, ఈ విధమైన అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వంటేపాక వెంకటేశ్వర్లు అన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా మా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చలో హైదరాబాద్ కార్యక్రమానికి మా రాష్ట్ర కమిటి పిలుపు మేరకు ఈ కార్యక్రమానికి వెళ్లనీయకుండా తెల్లవారకముందే మూడున్నర గంటల ప్రాంతంలో ఇంటి నుంచి సీఐటీయూ నాయకులను దేశద్రోహులను అరెస్టు చేసినట్టు అరెస్టు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ నిర్బంధాలు ప్రభుత్వానికి మంచిది కాదని హెచ్చరించారు.

మర్రిగూడ : అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య ప్రభుత్వానికి హెచ్చరించారు.అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా భవన నిర్మాణం,హమాలి మరియు పలు రంగాల కార్మికుల కోసం కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు,అదేవిధంగా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర కమిటీ చలో హైదరాబాద్ కు పిలుపునిచ్చింది ఈ సందర్భంగా మండలంలోని సీఐటీయూ నాయకులను పోలీసులు శుక్రవారం తెల్లవారుజామున ఇంటి వద్దకు వెళ్లి ముందస్తు అరెస్టు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.అరెస్ట్ అయిన వారిలో సల్వోజు రామలింగ చారి,భూష రాజు, లక్ష్మణ్ వనపర్తి జానయ్య యాచారం మల్లేశ్ లు ఉన్నారు.

పట్టణ ప్రాంతాల్లో ఉపాధి హామీని వర్తింపజేయాలి

నవతెలంగాణ-క్లాక్టవర్

పట్టణ ప్రాంతాల్లో ఉపాధి హామీ చట్టాన్ని వర్తింపజేయాలని కోరుతూ ఈ నెల 24న ఆర్డీవో కార్యాలయం ముందు జరుగు ధర్నా ను జయప్రదం చేయాలని పట్టణ పేదల సంఘం కన్వీనర్ దండంపల్లి సత్తయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణ పేదల సంఘం ఆధ్వర్యంలో చర్లపల్లి వినాయక నగర్ అంబేద్కర్ నగర్, అర్జాలబావి ఇండస్ట్రియల్ ఏరియా తదితర ప్రాంతాలలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ,ఉపాధి హామీ చట్టం పట్టణ ప్రాంతాల లో అమలు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి కి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో భూమిలేని పేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా సంవత్సరానికి 12,000 ఇవ్వడానికి నిర్ణయించి అమలు జరుగుతున్నది కానీ పట్టణ ప్రాంతాల్లో భూమిలేని పేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమలు చేయకపోవడం విచారకరమని అన్నారు. ధర్నాలో పట్టణ పేదలు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం పట్టణ అధ్యక్షులు పిన్నపురెడ్డి మధుసూదన్ రెడ్డి, పట్టణ పేదల సంఘం నాయకులు గౌరీ దేవి మధుసూదన్, మిరియాల శ్రీవాణి, గంజి రాజేష్ ,రాపోలు సరస్వతి, బుచ్చి రాములు, కళావతి, గిరిబాబు, సైదులు, నాగరాజు ,జానకి పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి బడ్జెట్లో ఎక్కువ నిధులు కేటాయించాలి

నవతెలంగాన-చిట్యాల

ప్రభుత్వ బడ్జెట్ లో వ్యవసాయ రంగానికి తగిన కెటాయింపులు లేవని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొంతల చంద్రారెడ్డి అన్నారు. మండలంలో పిట్టంపల్లి గ్రామంలో శుక్రవారం సీపీఐ(ఎం), రైతు సంఘాల నాయకులతో కలిసి ఆయన ఎండిపోయిన వరి పొలాలు పరిశీలించి, రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రైవేటు కంపెనీలపై ఆధారపడి విత్తనోత్పత్తి రంగానికి, ప్రకృతి వైపరీత్యాలు, వడగండ్ల వానల వల్ల నష్టపోయే రైతులను ఆదుకోవడానికి కూడా బడ్జెట్ లో చిన్న చూపు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు అరూరి శ్రీను, రైతు సంఘం మండల అధ్యక్షులు బొబ్బిలి సుధాకర్ రెడ్డి, సీపీఐ(ఎం) మండల నాయకులు మెట్టు నర్సింహా, మెట్టు పరమేష్, మల్లేష్,బాతరాజు లాలు, సింగిరెడ్డి యాదిరెడ్డి, క్రిష్టారెడ్డి, లక్ష్మయ్య, ఇస్తారి, పాపయ్య పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డికి ఘన సన్మానం

నవతెలంగాణ-క్లాక్‌టవర్



కనగల్లు మండలంలోని చిన్న మాధారం ఉన్నత పాఠశాలలో ప్రముఖ కవి రచయిత కోమటిరెడ్డి బుచ్చిరెడ్డిని పాఠశాలలో ఘనంగా సన్మానించారు. శుక్రవారం ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా ఆంగ్ల ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న బుచ్చిరెడ్డి గత ఇరవై సంవత్సరాలుగా సాహిత్యంలో పని చేస్తూ విద్యార్థుల కోసం ఎన్నో పుస్తకాలు రాశారు. ఆయన ఇటీవలనే బంతిపూలు పిల్లల కథల పుస్తకానికి రాయలసీమ నుండి బాల సాహిత్య పురస్కారం కూడా పొందారు.పురస్కారం లభించడంపట్ల మండల విద్యాధికారిణి వల్లపట్ల పద్మ అభినందనలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు దేశిడి రజిత, మధుసూదన్, నరేందర్ రెడ్డి, వాసు, శ్రీరాములు, జూనియర్ అసిస్టెంట్ సరిత, సిఆర్పి సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సహకార సంఘం అభివృద్ధికి కృషి చేయాలి

నవతెలంగాణ-చిలుకూరు

ప్రతి ఒక్కరూ సహకార సంఘం అభివృద్ధికి కృషి చేయాలని చిలుకూరు సహకార సంఘం చైర్మెన్ అలసకాని జనార్ధన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సహకార సంఘంలో జరిగిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులందరూ సహకార సంఘ అభివృద్ధికి కృషి చేయాలన్నారు అప్పుడే ఆ సంఘం లాభాల బాటలో నడుస్తుంది అన్నారు రైతులందరూ గతంలో తీసుకున్న ఎల్టీ లోన్లు దీర్ఘకాలిక లోన్లు తదితర లోన్లు తీసుకున్న వారందరూ సకాలంలో చెల్లించి సంఘ అభివృద్ధికి కృషి చేయాలి అన్నారు. మొదటగా సంఘం సీఈవో చిలువేరు లక్ష్మీనారాయణ సంఘం యొక్క లావాదేవీలను రైతులకు వివరంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ గన్న పద్మావతి డైరెక్టర్లు కస్తూరి సైదులు కోడారు రాంబాబు బర్మావతు రమేష్ గుగులోతు రాములు గొర్రె శ్రీహరి పాయలు నాగరాజు రాయబారపు లక్ష్మయ్య కొండ సోమయ్య బెల్లంకొండ సైదులు సహకార సంఘం సిబ్బంది మట్టపల్లి ధనమూర్తి గండెల పుల్లయ్య కొండ నాగరాజు గుగులోతు మోతిలాల్ శీలం మహేష్ బెల్లంకొండ లక్ష్మమ్మ రైతులు తదితరులు పాల్గొన్నారు.

మాలల ఆత్మగౌరవ సభ కరపత్రం విడుదల

నవతెలంగాణ-తిరుమలగిరి

ఈ నెల 29వ తేదీన సూర్యాపేట జిల్లా కేంద్రంలో కలెక్టర్ ఆఫీస్ రోడ్డు ఆర్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగే మాలల ఆత్మగౌరవ సభ సంబంధించిన కరపత్రాన్ని తిరుమలగిరి చౌరస్తా లో అంబేద్కర్ విగ్రహం ఎదుట శుక్రవారం మాల మహానాడు జిల్లా కో కన్వీనర్ గంట యాకోబు, మండల అధ్యక్షులు గంట సందీప్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి మండల ఉపాధ్యక్షులు పెరుమళ్ళ జానీ, తొండ గ్రామ శాఖ అధ్యక్షులు మల్లయ్య, మాల మహానాడు నాయకులు తిరుమలగిరి మున్సిపాలిటీ గౌరవ సలహాదారులు మద్దెల (చిన్ని) ప్రభుదాస్ జాన్ నరసయ్య , గంట సాల్మన్, సుధాకర్ దాసరి ప్రకాష్, జీవరత్నం రమేష్, మహిళ తిరుమలగిరి మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి అల్లే పుష్ప, రేణుక ,దయామని తదితరులు పాల్గొన్నారు.

29న టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-మద్దిరాల

ఈ నెల 29న టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలని ఆ పార్టీ తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి ఆకారపు రమేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ గ్రామాల్లో భారీ సంఖ్యలో అభిమానులు వున్నారని రాబోయే రోజుల్లో రాష్ట్రంలో టీడీపీ రాజకీయ్యాల్లో చక్రం తిప్పాబోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలోజిల్లా నాయకులు దండంపెల్లి నరేష్, మండల నాయకులు జలగం నరేష్, పాల్వాయి బాలయ్య, ఆకుల రమేష్, సిలివేరి లింగరాజు, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-చివ్వెంల

గ్రామ ప్రజలు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ చక్రాల సంతోష్‌కుమార్ సూచించారు. మండలంలోని బండమీది చందుపట్లలో కలెక్టర్ ఆదేశాల మేరకు పెద్ద గ్రామ పంచాయతీలలో చలివేంద్రం ఏర్పాటు చేయాలని ఆదేశాలతో శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. వేసవిలో దాహం తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం ఆభినందయమని అన్నారు వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ముందుకు వచ్చిన కలెక్టర్ కు, అధికారులకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మల్లయ్య, మహిళా సంఘం సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మోతే : వేసవిలోప్రయాణికుల దాహం తీర్చడానికి మండలంలోని రాఘవపురం ఎక్స్ రోడ్డులో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం గ్రామ కార్యదర్శి సంపత్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికుడు చిట్యాల రవిచంద్ర గ్రామస్తులు పాల్గొన్నారు.

బీసీ,ఎస్టీ వర్గీకరణ బిల్లు ఆమోదం హర్షణీయం

నవతెలంగాణ-సూర్యాపేట

భారతదేశంలో ఎక్కడ లేని విధంగా బీసీ,ఎస్టీ వర్గీకరణ బిల్లుకు శాసనసభలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆమోదం తెలిపిందని కాంగ్రెస్ జిల్లా యువజన అధ్యక్షులు ఎలిమినేట్ అభినయ్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు అంజద్ అలీలు అన్నారు. శుక్రవారం స్థానిక కొత్త బస్టాండ్ వద్ద పట్టణ యువజన అధ్యక్షులు బొడ్డు సాయి ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన అనంతరం వారు మాట్లాడారు . జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలల్లో అన్ని స్థానాల్లో కాంగ్రెస్ గెలుపొందుతుందన్నారు.ఈ కార్యక్రమంలో రుద్రంగి రవి, కాంగ్రెస్ యువజన నియోజకవర్గ అధ్యక్షులు కరీముల్లా బేగ్, అనంతుల యాదగిరి, నాగుల వాసు, ఆలేటి మాణిక్యం, అయూబ్ ఖాన్, సిరివెళ్ల శబరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విదేశీ విద్యానిధి పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

2024-25 విద్యా సంవత్సరానికి గాను అంబేద్కర్ విదేశీ విద్యనిధి పథకం ద్వారా అర్హులైన ఎస్సి కులానికి సంబంధించిన విద్యార్థుల నుంచి విదేశాల్లో ఉన్నత చదువులకు ఉపకార వేతనం కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులముల అభివృద్ధి అధికారి డీకే వసంతకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు మార్చి 20 నుంచి మే 19వరకు చేసుకోవాలని, సంబంధిత వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు జిల్లా కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

బిక్కేరు వాగు బ్రిడ్జిని డబుల్ చేయాలి



నవతెలంగాణ-మోత్కూర్

మోత్కూర్ మున్సిపాలిటీ కేంద్రంలో బిక్కేరు వాగు బ్రిడ్జి వద్ద సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు బొల్లు యాదగిరి మాట్లాడుతూ మోత్కూరు బిక్కేరు వాగుపై నిర్మించి వంతెన సుమారు 38 సంవత్సరాల క్రితం నిర్మించడం జరిగిందని, కాలానుగుణంగా వంతెనపై రవాణా పెరగడంతో వాహనాల రద్దీ మరీ పెరగింది. ప్రస్తుతం శిధిలావస్తకు చెరుకున్న వంతెన ప్రమాదకరంగా మారిందని వంతెన వెడల్పు తక్కువగా ఉండడంతో ఒకే సారి రెండు వాహనాలు ఎదురెదుగా వెళ్ళే అవకాశం లేక పోవడంతో తరచూ ప్రమాదాలు గురౌతున్నాయి. పాదాచారులు, రాత్రివేళ పోలాలకు వెళ్ళె రైతులు అవస్థలు పడుతున్నారని. రెండు ఉమ్మడి నల్లగొండ, వరంగల్ జిల్లాలకు రాకపోకలకు సులువైన రహదారి కావడంతో నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారి పై ఉన్న బిక్కేరు వాగుపై ఉన్న వంతెనను నేటి కాలానికి అణుగుణంగా అధునా తనంగా హై లెవల్ వంతెననుగా నిర్మించాలని తక్షణమే ప్రభుత్వము స్పందించాలని బిక్కేరు వాగు హైలేవల్ వంతెనను నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యురాలు రాచకొండ రాములమ్మ, పార్టీ మోత్కూరు టౌన్ నాయకులు కూరపాటి రాములు, మెతుకు అంజయ్య, కందుకూరి నర్సింహా, కూరెళ్ల నరేష్, సావిత్రమ్మ, గుండు లక్ష్మీ, ఎండి తహేర, నర్సయ్యగౌడ్ పాల్గొన్నారు.

'క్రమశిక్షణ గల పౌరులుగా తీర్చిదిద్దేవి ప్రభుత్వ పాఠశాలలు'

నవతెలంగాణ-రాజాపేట

పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు క్రమశిక్షణ కల్గిన పౌరులుగా తీర్చిదిద్దేవే ప్రభుత్వ పాఠశాల అని రాజాపేట ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సట్టు జయంత అన్నారు. శుక్రవారం నెమిల ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్నభోజనం పరిశీలించి సంతృప్తి చెంది పలు సూచనలు చేశారు. మెనూ ప్రకారం పౌష్టికహారం అందించడంతో సంతోషం వ్యక్తం చేశారు. ప్రతి రోజు పేద పిల్లలకు రాగి జావా, కోడిగ్రుడ్లు అందించేలా ప్రాధనోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చొరవ తీసుకోవడం పట్ల అభినందించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సమ్మిలిత విద్యతో పాటు రవాణాభత్యం, స్టైఫండ్, రీడర్ సదుపాయాలు, సహాయాపకారణాలు ప్రభుత్వము అందిస్తుందన్న విషయాల పై అవగాహన కల్పించినారు. రికార్డులను పరిశీలించి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో నెమిల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నమిల భరత్ కుమార్ ఉపాధ్యాయులు మమత, భార్గవి, రజిత, సుజాత క్లస్టర్ రీసోర్స్ పర్సన్ జమాల్పురం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కాటేపల్లి వాసికి ఓయు డాక్టరేట్

నవతెలంగాణ-మోటకొండూరు



మోటకొండూరు మండలం, కాటేపల్లి గ్రామంలోని పచ్చిమట్ల సత్తయ్య- చంద్రకళ కుమారుడు పచ్చిమట్ల జలంధర్‌కు ప్రతిష్టాత్మక ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు డిపార్ట్మెంట్ వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. జలంధర్ సాహిత్యం మీద మక్కువతో ఎంఏ తెలుగు ఆర్ట్స్ కళాశాలలో చేశాడు. నెట్, జేఆర్ఎఫ్ పీజీ ద్వితీయ సంవత్సరంలోనే ఉత్తీర్ణులై జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ కు ఎంపికయ్యారు. అదే యూనివర్సిటీలో ఆచార్య సూర్య ధనుంజయ్(వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్) పర్యవేక్షణలో "జూకంటి జగన్నాథం సాహిత్యం - పరిశీలన" అనే అంశం పై పరిశోధన చేశారు. ఈ సందర్భంగా ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య సాగి కమలాకర శర్మ గారు,ఆచార్య సూర్యా ధనుంజయ్, ఆచార్య చింతకింది కాశీం (ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్), ఆచార్య ఎ. విజయలక్ష్మి, ఆచార్య రఘు, రీసెర్చ్ స్కాలర్స్ పీజీ విద్యార్థులు జలంధర్ నీ అభినందించారు. కాటేపల్లి గ్రామం నుండి పి హెచ్ డి డాక్టరేట్ పట్టా పొందిన మొదటి విద్యార్థి జలంధర్ అయినందుకు కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు, మిత్రులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పరిశీలన

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆలేరు మండలం మంతపురి గ్రామంలో అభివృద్ధి పనుల ముఖ్య కార్యనిర్వాహన అధికారి ఎన్ శోభారాణి శుక్రవారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులలో అధికారుల సూచనలు, నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. లబ్దిదారులతో మాట్లాడుతూ త్వరగా పనులు పూర్తి చేసుకోవాలని కోరారు. నర్సరీ సందర్శించి, మంచినీటి సరఫరా పై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యాంజనేయ ప్రసాదు, ఆర్డబ్ల్యుసి సుప్రియ, పంచాయతీ కార్యదర్శి సంతోష్ రెడ్డి, విఓఏ పాల్గొన్నారు.

ఆది జాంబవ యువజన సంఘం నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-రామన్నపేట

మండలంలోని వెల్లంకి గ్రామ ఆది జాంబవ యువజన సంఘం నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సండ్ల లింగయ్య, ఉపాధ్యక్షులుగా తలారి శేఖర్, ప్రధాన కార్యదర్శిగా నకిరేకంటి రవి, కోశాధికారిగా కుర్మ వెంకటేష్, సహాయ కార్యదర్శులుగా చెన్ని స్వామి, జినుక లింగయ్య, కార్యవర్గ సభ్యులుగా నకిరేకంటి మహేష్, జినుక సాయిలు, చేగూరి ముత్యాలు, గూని రాజు, కోరబోయిన నరసింహ, సండ్ల గణేష్, కిషన్ ఎన్నికయ్యారు.

భౌతిక శాస్త్ర పరిశోధన ప్రయోగశాల ప్రారంభం

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం భౌతికశాస్త్ర విభాగంలో మెరుగైన పరిశోధనలకు అనుగుణంగా అభివృద్ధి పరచిన ప్రయోగశాలను ఉపకులపతి ఆచార్య కాజా అల్తాఫ్ హుస్సేన్ ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన బహుల్యానికి ఉపయుక్తమైన నాణ్యమైన పరిశోధనల అవసరాన్ని గుర్తు చేశారు. సవాళ్లకు పరిష్కారాల దిశగా అభ్యసనం ఉత్తమ ఫలితాలను ఇస్తున్నట్లు రుజువైందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య అల్వాల రవి, ప్రిన్సిపాల్ డా కె ప్రేమ్ సాగర్, సైన్సెస్ డీన్ ఆచార్య వసంత, విభాగ అధిపతి డా కొప్పుల సత్తిరెడ్డి, డా ఎన్ బిక్షమయ్య, డా రమేష్, డా శాంత కుమారి, ఆదిరెడ్డి, వీరస్వామి, డా రూప, డా శివరాం, తదితర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుని మృతి

నవతెలంగాణ-నకిరేకల్

నకిరేకల్ పట్టణంలో పద్మా నగర్ జంక్షన్ వద్ద రోడ్డు దాటుతూ వృద్ధుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన మహమ్మద్ సాగీర్ (69) పట్టణంలోని పద్మా నగర్ జంక్షన్ వద్ద తన కూతురు, అల్లుడు టైర్ల పంచర్ షాప్ పెట్టుకొని ఐదేళ్లుగా జీవనం సాగిస్తున్నారు. సాగిర్ కూడా తన కూతురు వద్దే ఉంటూ జీవనం గడుపుతున్నాడు. శుక్రవారం పద్మా నగర్ జంక్షన్ వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో హైదరాబాదు నుండి విజయవాడ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టడంతో సాగీర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమార్తె మసరత్ పర్వీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లచ్చిరెడ్డి తెలిపారు.

బాధితునికి రూ. 15 వేల ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-కొండమల్లేపల్లి

దేవరకొండ పట్టణం ఖిల్లా బజార్కు చెందినటువంటి గంజి నరసింహ గాయాలై అనారోగ్యంతో బాధపడుతుండడంతో విషయం తెలుసుకున్న కొండమల్లేపల్లి హెల్పింగ్ హాండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం బాధితుడు నివాసానికి వెళ్లి బాధితుడిని పరామర్శించి 15 వేల రూపాయల నగదును అందజేసి పెద్ద మనసు చాటుకున్నారు. ఈ సందర్భంగా బాధితుడు హెల్పింగ్ అండ్ సొసైటీలు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు కొండమల్లేపల్లి మండల ప్రెస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఏరుకొండ రాము, కూన భానుచందర్, అల్గువెల్లి నాగార్జున రెడ్డి, ఆడెపు సతీష్, ఎర్ర యాదగిరి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నిధులు దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తప్పవు

నవతెలంగాణ-వేములపల్లి

గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపీఓ జయలలిత అన్నారు. శుక్రవారం మండలంలోని అమనగల్లు గ్రామ పంచాయతీ రికార్డును స్వాధీనం చేసుకున్నారు. గ్రామపంచాయతీ నిధులు దుర్వినియోగం అయ్యాయని గ్రామ ప్రజలు ఇటీవల మిర్యాలగూడ సబ్ కలెక్టర్‌కు 2024 నవంబర్ 06 తేదీన ఫిర్యాదు చేశారు. డీ ఎల్ పి ఓ ఆదేశాల మేరకుపంచాయతీల్లో జరిగిన అభివృద్ధి పనులు, నిధుల దుర్వినియోగం పై విచారించినట్లు తెలిపారు. నివేదికను జిల్లా అధికారులకు అందజేస్తామని, ఆదేశా నుసారం తదుపరి చర్యకు రికార్డులను డిఎల్పిఓ కు సమర్పి స్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఏయిడ్స్ అంటు వ్యాధి కాదు

నవతెలంగాణ-నిడమనూరు

ఏయిడ్స్ అనేది అంటూ వ్యాధి కాదని ప్రజలు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైఆర్జీ స్వచంద సంస్త నిర్వాహకులు నర్సింహ పేర్కొన్నారు. శుక్రవారం మండలం లోని తుమ్మడం గ్రామం లో వైఆర్జీ స్వచంద సంస్థ ఆధ్వర్యంలో 106మందికి ఏయిడ్స్ ఉచిత రక్త పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామంలో ఉచిత పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.18ఏండ్ల నుండి 50ఏండ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఏయిడ్స్ పరీక్షలు చేపించుకువాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి గంగుల లింగయ్యే, యాదగిరి వెంకన్న, మహేష్, కోటయ్యే పాల్గొన్నారు.

ఉప కులపతికి క్రీడాకారుల కృతజ్ఞతలు

నవతెలంగాణ-నార్కట్‌పల్లి



మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ పీజీ కళాశాలల విద్యార్థులు ఆయా విభాగాలలో రాష్ట్ర జాతీయస్థాయిలో ప్రాతినిధ్యం వహించి తదుపరి పోటీలకు సిద్ధమవుతున్నారు. ఈ సందర్భంలో విశ్వవిద్యాలయం క్రీడా ప్రాంగణాలను అభివృద్ధికి చేపట్టిన చర్యలకు కృతజ్ఞతగా ఉపకులపతి ఆచార్య కాజా అల్తాఫ్ హుస్సేన్ ను కలిశారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు ప్రవళిక, సింధు, రాజేశ్వరి, అఖిల, స్పోర్ట్స్ బోర్డు సెక్రెటరీ హరీష్ కుమార్, ఆచార్య సోమలింగం, డా మురళి, డా శ్రీనివాసరెడ్డి , డా శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-నకిరేకల్

నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డుకి చెందిన గద్దపాటి సుందరయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా ప్రజా గాయిని వేముల పుష్ప శుక్రవారం వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చి, 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు.

దళితుల శ్మశాన వాటికల్లో మౌలిక వసతులు కల్పించాలి

నవతెలంగాణ-నకిరేకల్



దళితుల శ్మశాన వాటికల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి వంటేపాక వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో చీమలగడ్డలోని దళితుల శ్మశాన వాటికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్మశాన వాటికలో ప్రహరి గోడ లేకపోవటం వల్ల ఇక్కడ చనిపోయిన వారిని బొంద పెడితే పందులు శవాన్ని బయటికి తీసి పీక్కు తింటున్నాయన్నారు. దీంతో దుర్వాసన వచ్చి ప్రజలు ఇబ్బందులు బారిన పడుతున్నారన్నారు. స్నానపు గదులు ,బోరు మోటారు లేకపోవడం వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే స్నానాల గదులు, బోరు మోటర్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సాకుంట్ల నరసింహ, వంటేపాక కృష్ణ, పుట్ట పరమేశం, ఆదిమల్ల ప్రవీణ్, వంటేపాక జమదగ్ని పాల్గొన్నారు.

ఇరిగేషన్ ఈ ఈ శ్రీనివాస్‌రెడ్డి ఏఈ నవీన్‌లకు సన్మానం

నవతెలంగాణ-నార్కట్‌పల్లి



బ్రాహ్మణ వెల్లంల పైలాన్ రేణుక ఎల్లమ్మ కల్యాణ మహోత్సవానికి వచ్చిన ఇరిగేషన్ ఈఈ గంగం శ్రీనివాస్ రెడ్డి, ఏఈ నవీన్ లను కాంగ్రెస్‌మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య శుక్రవారం ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు , తదితరులు పాల్గొన్నారు.

10 ఫలితాలతోనే విద్యార్థుల భవిష్యత్

నవతెలంగాణ-మునుగోడు



విద్యార్థి దశలో పదవ తరగతి విద్య చాలా కీలకమైనది, విద్యార్థుల భవిష్యత్ నిర్ణయించబడేదే 10 తరగతి ఫలితాలు అని వెదిరె పూలమ్మ ఫౌండేషన్ సభ్యులు వెదిరె విజేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం పదవ తరగతి పరీక్ష కేంద్రాలకు వెళ్లేందుకు మండలంలోని కొంపెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు తమ తల్లి వెదిరె పూలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆటో వసతులను ఏర్పాటు చేశారు . పరీక్ష కేంద్రాల వద్దకు వెళ్లి విద్యార్థులకు ఆల్ ద బెస్ట్ తెలియజేశారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆందోళన వీడి ఆత్మవిశ్వాసంతో అడుగులు వేయాలని సూచించారు .ఈ కార్యక్రమంలో బాజా మనోజ్ , బోయపర్తి సురేందర్ , డాక్టర్ సంకు శంకర్ , జీడిమడ్ల శ్రీను తదితరులు ఉన్నారు.

ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్

నవతెలంగాణ-చండూరు

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా పూర్తిగా విస్మరించిందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక శీలా అనసూయ గార్డెన్స్ లో జరిగిన మండల, మున్సిపల్ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు రాబోయే స్థానిక ఎన్నికల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలకు వివరించాలన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల పై, పోరాటం చేయాలనీ నాయకులకు,కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల, అధ్యక్షులు ముదిగొండ ఆంజనేయులు,మున్సిపల్ పట్టణ పందుల సత్యం గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ దూడల బిక్షం గౌడ్, అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ కాసాల జనార్ధన్ రెడ్డి, సీనియర్ నాయకులు బొబ్బల మురళి మనోహర్ రెడ్డి, యువ మోర్చా రాష్ట్ర నాయకులు పిన్నింటి నరేందర్ రెడ్డి, భూతరాజు శ్రీహరి, జిల్లా నాయకులు అన్నేపర్తి యాదగిరి, ఏనుగు వెంకట్ రెడ్డి,సింగిల్ విండో డైరెక్టర్ బోడ ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీ రావిరాల శ్రీను, ఎస్సీ మోర్చా జిల్లా నాయకులు ఇరిగి ఆంజనేయులు,తదితరులు పాల్గొన్నారు.

యువతను నిరాశపరిచిన రాష్ట్ర బడ్జెట్

- డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు పతాని శ్రీను

నవతెలంగాణ-వేములపల్లి



తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ యువతను నిరాశపరిచిందని డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఉన్న యూత్ డిక్లరేషన్‌లో భాగంగా రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి ,యూత్ కమిషన్ ను ఏర్పాటు చేస్తామని హామీలు ఇచ్చి విస్మరించిందన్నారు. ఈ బడ్జెట్లో నిరుద్యోగ యువత ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే అంతవరకు 4వేల రూపాయల నిరుద్యోగ భృతి కి నిధులు కేటాయిస్తారేమోనని ఆశలు పెట్టుకున్నా యువతకు బడ్జెట్ ప్రసంగంలో ఎక్కడా పదమే ఊసేత్తకుండా యువతను మోసం చేసిందన్నారు. ప్రతి ఏడాది రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి కేవలం 57 వేల ఉద్యోగాలను మాత్రమే భర్తీ చేసి గొప్పలు చెప్పుకుంటుందన్నారు.స్వయం ఉపాధి రుణాలు 6000 కోట్ల రూపాయలు కేటాయిస్తున్నామని చెప్పిబదు లక్షల మందికి ప్రకటించారన్నారు. రాజీవ్ యువ వికాసం పేరుతో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులో పేరు ఉంటేనే అర్హులని చెప్పడం సరైనది కాదన్నారు. రేషన్ కార్డు లింక్ పెట్టకుండా రాజీవ్ యువ వికాసం పథకాన్ని అర్హులైన నిరుద్యోగులు అందరికీ వర్తింప చేయాలన్నారు. ప్రభుత్వం వెంటనే బడ్జెట్ ను సవరించి నిరుద్యోగ యువత ఉద్యోగ ఉపాధి అవకాశాలకై రాష్ట్రంలో పెరుగుతున్న నిరుద్యోగ రేటును దృష్టిలో పెట్టుకుని బడ్జెట్ కేటాయింపులు చేయాలని డిమాండ్ చేశారు.

సివిల్ సర్వీసెస్ ఎంప్లాయిస్ ఖోఖో పోటీలకు మురళి ఎంపిక

నవతెలంగాణ-పెద్దవూర



నల్గొండ జిల్లాలోని జెడ్పిహెచ్ఎస్ పులిచెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న కూతాటి మురళి ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ జాతీయస్థాయి ఎంప్లాయిస్ ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు.జనవరి నెలలో హైదరాబాద్ లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్రస్థాయి ఖోఖో ఫైనల్ సెలక్షన్ లో నల్గొండ జిల్లా తరపున పాల్గొని, అత్యుత్తమ ప్రతిభ కనబర్చి నందుకుగాను ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ ఎంప్లాయిస్ జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక అయ్యానని మురళి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.న్యూఢిల్లీ లోని వినయ్ మార్గ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ మైదానంలో ఈ నెల 24వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర సివిల్ ఎంప్లాయిస్ పురుషుల జట్టు తరపున పాల్గొంటున్నానని మురళి తెలిపారు. మురళి ఎంపిక పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తాపీ మేస్త్రీ కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-తిరుమలగిరి సాగర్

సమస్య ఉంది అని తెలిస్తే, తన వంతుగా సహాయం చేస్తూ పగడాల సైదులు యాదవ్ మరో మారు మానవత్వం చాటుకున్నారు. మండలంలోని రంగుడ్ల గ్రామంలో ఇటీవల కాలంలో తాపీ మేస్త్రీ రమావత్ లచ్చు నాయక్ మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న సమాజ సేవకులు పగడాల సైదులు యాదవ శుక్రవారం ఆ గ్రామానికి చెందిన తాపీమేస్త్రీలతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబాన్ని పరామర్శించి 10 వేలు ఆర్థక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి సాగర్ మండల తాపీ మేస్త్రీల అధ్యక్షుడు హనుము నాయక్ ,గోపాల్ నాయక్ ,సర్దార్ నాయక్ ,నరేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'అంబేద్కర్ ఆశయ సాధన కోసమే.. ఒకే దేశం ఒకే ఎన్నిక'

నవతెలంగాణ-రాజాపేట

మండల కేంద్రంలోని గెస్ట్ హౌస్‌లో వన్ నేషన్ వన్ ఎలక్షన్ కార్యక్రమం కార్యశాల ఏర్పాటు శుక్రవారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా నాయకులు పాశం భాస్కర్ గారు పాల్గొని కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ జమిలి ఎన్నికల అభిప్రాయ సేకరణ కోసం మాజీ రాష్ట్రపతి రాం నాథ్ కోవిద్ అధ్యక్షతన కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జమిలి ఎన్నికలతో దేశం మరింత అభివృద్ధి పదం లో ముందుకు పోతుంది అని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం దేశ అనుకూల కార్యక్రమాలకు ఎప్పుడు వ్యతిరేకంగా ఉంటుంది అన్నారు. అంబేద్కర్ కూడా జమిలి ఎన్నికలతోనే దేశం అభివృద్ధి చెందుతుంది అని విశ్వసించే వారు అని అన్నారు. దేశ స్వాతంత్రం తర్వాత జరిగిన ఎన్నికలు జమిలి పద్ధతి లోనే జరిగేవి కానీ కాంగ్రెస్ ప్రభుత్వం యొక్క అధికార దాహం తో ఆ జమిలి వ్యవస్థను విచ్చిన్నం చేసారని తెలిపారు. పార్టీలకి అతీతంగా జమిలి ఎన్నికల పైన ఉన్న సందేహాలు నివృతం చేయాలని సూచించారు. వన్ నేషన్ వన్ ఎలెక్షన్ తో దేశం ఆర్థిక పురోగతిని సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మేకల రమేష్ అధ్యక్షతన జరగగా మేకల రమేష్ మాట్లాడారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ మండల కన్వీనర్ చాపురం శ్రీశైలం, మండల ప్రధాన కార్యదర్శి గాండ్ల నరసింగరావు, కంచర్ల శ్రీనివాస్ రెడ్డి , బిజెపి ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు బుక్యా శ్రీను నాయక్ , జిల్లా కౌన్సిల్ మెంబర్ పుట్ట వీరయ్య దాచేపల్లి శ్రీనివాస్, బీజేవైఎం జిల్లా నాయకులు బూరుగు శేఖర్ రెడ్డి, రాజం నగేష్ యాదవ్ ,కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు మెండు భగవాన్ రెడ్డి, మండల బీసీ మోర్చా అధ్యక్షులు కాకళ్ల నవీన్, బీజేవైఎం మండల అధ్యక్షులు మార్క శివ, దిడ్డి సత్యనారాయణ, చిగుళ్ల బీరప్ప, జెన్నె సిద్దులు, బిమగాని శివ, బూరుగు వెంకటేష్, దండే సంపత్, రంగ నరేష్ గౌడ్, సంగెం వేణు, ఐరేని శ్రీధర్, పోచంగల్ల బాబు, ఉప్పరి మల్లేశం, కోయ ఉపేందర్, బొమ్మగాని రవికుమార్, పిట్టల పోషయ్య, తదితరులు పాల్గొన్నారు. టిఆర్ఎస్ మండల పార్టీ మాజీ అధ్యక్షులు కంచర్ల శ్రీనివాస్ రెడ్డి ఇటీవల బీజేపీలో చేరగా ఆయనను శాలువాతో సత్కరించి అభినందించారు.

కేసీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు

నవతెలంగాణ-భువనగిరి

బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ సన్నాహక సమావేశాలు, కార్యక్రమాలు జరుగుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ అధినేత , తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గారిని మాజీ మంత్రి , సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్ రెడ్డి (భువనగిరి), గ్యాదరి కిషోర్ కుమార్ (తుంగతుర్తి), గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి (ఆలేరు) శుక్రవారం ఎర్రవెల్లి లోని వారి నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా పార్టీ రజతోత్సవ కార్యక్రమాల నిర్వహణ, వరంగల్ బహిరంగ సభ తదితర అంశాలపై పార్టీ అధినేత నాలుగు నియోజక వర్గాల నాయకులకు దిశ నిర్దేశం చేశారు. త్వరలో ఉమ్మడి నల్గొండ జిల్లాలోని మిగతా ఎనిమిది నియోజకవర్గాల ముఖ్యనాయకులతో సమావేశం ఉంటుందని పార్టీ అధినేత కేసీఆర్ తెలిపారు.

వికలాంగులకు ఉచిత ఉపకరణాలు పంపిణీ

నవతెలంగాణ-రాజాపేట

మండల కేంద్రంలోని ప్రత్యేక అవసరాలు గల వికలాంగులకు ఉచిత ఉపకరణాలను భారత కృత్రిమ అవయవాల నిర్మాణ సంస్థ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. శుక్రవారం ఐ. ఈ. ఆర్. టి. సంధ్యారాణి వివరాలు చెప్పారు. ఈ కార్యక్రమానికి యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు, జిల్లా విద్యాధికారులు యువ్వగా సహిత విద్యా కోఆర్డినేటర్ పెసరు లింగారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. నడవలేని పిల్లలకి కాలిపర్స్ రోలేటర్స్ ట్రై సైకిల్ ఇతరులకు బ్రెయిలీ కిట్టులను అందజేసినట్లు వివరించారు. కార్యక్రమానికి దివ్యాంగ విద్యార్థులు తల్లిదండ్రులు బోధిస్తున్న ఇంక్లూజ్ ఎడ్యుకేషనల్ రిసోర్స్ పర్సన్స్ హాజరైనట్లు చెప్పారు. కలెక్టర్ చేతుల మీదుగా పరికరాలు అందుకోవడం సంతోషంగా ఉందని పిల్లల తల్లిదండ్రులు కృతజ్ఞతలు చెప్పారు.

పరీక్షా కేంద్రంలో ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-రాజాపేట

మండలంలోని మూడు ఎస్ఎస్సి పరీక్షా కేంద్రాలను మొదటిరోజు శుక్రవారం తెలుగు పరీక్ష సమయంలో ఫ్లయింగ్ స్క్వాడ్ నాగవర్ధన్ రెడ్డి బృందం ఆకస్మికంగా సందర్శించారు. నిర్వాహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. రాజపేట ఎస్సై అనిల్ కుమార్ రఘునాథపురం రాజపేటలోని పరీక్షా కేంద్రాల పరిసరాలను పోలీసు బృందంతో కలిసి పరిశీలించారు. పరీక్షల సమయంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని గుర్తు చేశారు. ఓడు పరీక్షా కేంద్రాలలో ఇద్దరు బాలికలు గైర్హాజరైనట్లు ఎంఈఓ చందా రమేష్ తెలిపారు. అందులో ఒకరు ఇటీవల మృతి చెందాగా, మరొకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పరీక్ష రాసేందుకు సెంటర్ లోకి వెళుతున్న సమయంలో ప్రతి విద్యార్థిని ఎంఈఓ చందా రమేష్ బృందం చెక్ చేశారు.